ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 21 అక్టోబరు 2024

వీడిన గ్రహణం

కూటమి ప్రభుత్వంలో ఎన్టీఆర్ ఇళ్లకు మోక్షం..!

బిల్లుల కోసం ఐదేళ్లుగా లబ్ధిదారుల నిరీక్షణ

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం స్థితిగతులపై సర్వే

రూ.45 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తింపు


కందుకూరులో నిర్మించుకున్న ఇంటిని సర్వేచేస్తున్న సిబ్బంది


కందుకూరులో నిర్మించుకున్న ఎన్టీఆర్ ఇల్లు

అనంతపురం సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిందని ఇళ్లు కట్టుకోవడం ప్రారంభించారు. అంతలోనే ఎన్నికలు వచ్చాయి. అధికారం చేతులు మారింది. దీంతో గృహ నిర్మాణ లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. ఏళ్లు గడిచాయి. ఇంటికి సంబంధించిన బిల్లులు మాత్రం మంజూరు కాలేదు. దీంతో లబ్ధిదారులు కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయారు. ప్రారంభించిన ఇంటి నిర్మాణాన్ని మధ్యలో వదిలివేయలేక అప్పులు చేసి పూర్తి చేసుకున్నారు. ఇదీ.. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో లబ్ధిదారులు పరిస్థితి. ఈ నేపథ్యంలోనే టీడీపీ నేతృత్వంలోని కూటమి పార్టీలు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాయి. దీంతో జిల్లాలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన ఇళ్ల పరిస్థితి, పెండింగ్ బిల్లుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. అంతటితో ఆగకుండా 2014-19 మధ్య జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ హౌసింగ్ కింద మంజూరు చేసిన 29,868 ఇళ్లకు సంబంధించి నిర్మాణాలు, పెండింగ్ బిల్లులు తదితర అంశాలతో కూడిన సమగ్ర వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో పెండింగ్ బిల్లులు వస్తాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో హౌసింగ్ అధికారులు ఎన్టీఆర్ ఇళ్ల సర్వేలో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు 27,595 ఇళ్లను సర్వే చేసి రూ. 45.10 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు.

సర్వే వేగవంతంగా చేస్తున్నాం



జిల్లాలో ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాల స్థితి గతులు, రావాల్సిన బిల్లులు తదితర అంశాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నాం. ఎక్కడికక్కడ సిబ్బందిని అప్రమత్తం చేసి సర్వే వేగవంతంగా చేయిస్తున్నాం. సర్వే ప్రక్రియ కూడా చివరి దశకు వచ్చేసింది. యాప్‌లో సమగ్ర వివరాలను నమోదు చేస్తున్నాం. త్వరలోనే సంబంధిత బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేస్తుందని భావిస్తున్నాం.

-శైలజ, హౌసింగ్ పీడీ

రూపాయి ఇవ్వని వైసీపీ ప్రభుత్వం

ప్రతి పేదవాడికి ఇల్లు లక్ష్యంతో 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం కింద జిల్లా వ్యాప్తంగా 29,868 మంది పేదలకు ఇళ్లను మంజూరు చేసింది. వివిధ కారణాలతో ఇళ్ల నిర్మాణం ఆలస్యమైంది. ఈక్రమంలో 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ ఇళ్లకు గ్రహణం పట్టింది. వైసీపీ సర్కార్ వైఖరితో బిల్లులు ఆగిపోయాయి. ప్రభుత్వం కూడా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథాకాన్ని పూర్తిగా పక్కనపెట్టేసింది. ఇళ్లు నిర్మించుకున్నవారికి కూడా ఒక్క రూపాయి మంజూరు చేయకుండా విస్మరించింది. దీంతో లబ్ధిదారులు సొంతింటి కల నెరవేర్చుకోవడానికి నానా అగచాట్లు పడ్డారు.

యాప్‌లో సమగ్ర వివరాలు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై ఆరా తీసింది. క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేసి యాప్ ద్వారా నిర్మాణాలు... వాటి పెండింగ్ బిల్లులు తదితర వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో ఆశాఖ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి సర్వే వేగవంతం చేశారు. ఇప్పటి వరకు 29,868 ఇళ్లలో 27,595 ఇళ్లను సర్వే చేసి రూ. 45.10 కోట్లు బిల్లులు ఆయా ఇళ్లకు చేయాల్సి ఉందని యాప్‌లో నమోదు చేశారు. మిగిలిన 2270 ఇళ్లను సర్వే చేసి సమగ్ర వివరాలను నమోదు చేయాల్సి ఉంది.

ఐదేళ్లపాటు కక్ష సాధింపు..!

టీడీపీ పాలనలో మంజూరైన వాటికి మన ప్రభుత్వం బిల్లులు చెల్లించడం ఏమిటన్న ఉద్దేశ్యంతో వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంపై కక్ష సాధింపునకు దిగింది. ఇందులో భాగంగానే ఎన్టీఆర్ హౌసింగ్ ఇళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో కూడా కనిపించకుండా చేసింది. బిల్లుల కోసం గత ఐదేళ్ల పాటు లబ్ధిదారులు కార్యాలయాలు, అధికారులు చుట్టూ తిరిగిన ఏమాత్రం ఫలితం దక్కలేదు. వైసీపీ పాలనలో గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలు ఆయా ప్రాంతాల్లో పర్యటించిన సమయాల్లో బిల్లులు కోసం బాధిత వర్గాలు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో బాధిత వర్గాలు అప్పటి ప్రభుత్వం వైఖరితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


కర్నూలు రోడ్డులో వేసిన వెంచర్

ప్లాట్లు

అక్రమ లేఔట్లతో కొనుగోలుదారుల అగచాట్లు

ఇళ్లు కట్టుకోవడానికి లభించని అనుమతులు

అక్రమాలపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం

ఆందోళనలో కొనుగోలుదారులు

గుత్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోనూ, పట్టణాన్ని ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో తామరతంపరగా పుట్టుకొచ్చిన అక్రమ లేఔట్లలో పాట్లు కొన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలు పాటించకుండా వేసిన ఈ లేఔట్లలో ఇల్లు కట్టుకోవడానికి అనుమతులు లభించక అగచాట్లు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఎక్కడపడితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా లేఔట్లు వెలిశాయి. వీటితో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లాది రూపాయలు గడించారు. అయితే మున్సిపాలిటీ, పంచాయతీల ఆదాయానికి మాత్రం గండి పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ అక్రమ లేఔట్లపై దృష్టి సారించి, చర్యలకు ఉపక్రమించింది. దీంతో పాట్లు కొన్నవారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మున్సిపాల్టీ పరిధిలో 91 అక్రమ లేఔట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో క్రయ, విక్రయాలపై ఆంక్షలు విధించారు. ఏ లేఔట్‌లోనైనా సరే నిబంధనల మేరకు 10శాతం ఖాళీ స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగించాలి. 30అడుగులు రోడ్లు ఉండాలి. అప్పుడే ఆ లేఔట్‌కు అప్రూవల్ లభిస్తుంది. ఇవేవి తెలియని ప్రజలు అక్రమ లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు మరిచిన అధికారులు

పట్టణానికి సమీపంలో ఉన్న వన్నెదొడ్డి, కొత్తపేట, బసినేపల్లి, బాచుపల్లి, తొండపాడు గ్రామాలు, అలాగే పట్టణ సమీపంలోని పెద్దవడుగూరు మండలంలోని గుత్తి అనంతపురం, కాశేపల్లి తదితర గ్రామాల్లో అక్రమ లేఔట్లు వెలిశాయి. 44వ జాతీయ రహదారి ఉండటంతో పెద్ద ఎత్తున రోడ్డుకు ఇరువైపులా లేఔట్లు వేశారు. అయితే మున్సిపాల్టీ లేదా గ్రామ పంచాయతీ అనుమతులు ఏవీ తీసుకోలేదు. అధికారులు కూడా ఇవి అక్రమ లేఔట్లని చర్యలు తీసుకోలేదు. దీంతో మున్సిపాలిటీకి గాని, పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి పడింది. ఈతతంగమంతా తెలియని కొనుగోలుదారులు హైవేకి దగ్గరగా ఉందన్న కారణంతో ఎగబడి ప్లాట్లు కొన్నారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా జరిగింది.

కొనుగోలుదారులకు తప్పనిపాట్లు

అక్రమ లేఔట్లలో ప్లాట్లు కొన్నవారికి మున్సిపల్ అధికారులతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్లాట్‌లలో ఇంటి నిర్మాణానికి అనుమతులు కావాలంటే ఎక్కువ డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుంది. 30అడుగుల రోడ్డు ఉండాలని లేని పక్షంలో అందులో 5 అడుగుల స్థలాన్ని మున్సిపాలిటీకి సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అక్రమ లేఔట్ కావడంతో గృహనిర్మాణానికి బ్యాంక్ రుణాలు ఇవ్వటం లేదు. ప్రభుత్వం కూడా మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. దీంతో పాట్లు కొన్నవారు నానా అవస్థలు పడుతున్నారు.

● ఈ విషయంపై టౌన్‌ప్లానింగ్ అధికారి మారుతీప్రసాద్‌ను వివరణ కోరగా మున్సిపల్ పరిధిలో 91అక్రమ లేఔట్లను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ లేఔట్లపై తగు చర్యలు చేపడుతామన్నారు.


గుత్తి-అనంతపురం రోడ్డు పక్కన వేసిన అనధికార వెంచర్

చెప్పినట్లు వినాల్సిందే..!

పుట్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓ అధికారి తీరు

ఎవరైనా ఆయన మాట వినాల్సిందే.. లేకపోతే రచ్చే



పుట్లూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): అక్కడ ఆయన మాటే వేదం. ఎంతటి అధికారి అయినా కిందిస్థాయి సిబ్బంది అయినా ఆయన మాట వినాల్సిందే. ఆయన చెప్పినట్లు నడుచుకోవాల్సిందే. లేకపోతే పైఅధికారులు, రాజకీయనాయకులతో చీవాట్లు పెట్టిస్తాడు. ఇదీ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓ అధికారి పనితీరు. దీనిపై పలు విమర్శలు వస్తున్నా ఆయన ఎక్కడా తగ్గడం లేదు. దీంతో బదిలీపై వచ్చిన కొందరు వీఆర్వోలు ఇక్కడకు ఎందుకు వచ్చాం రా దేవుడా అంటూ వాపోతున్నారు. ఇక్కడ పని చేసి వెళ్లిన వీఆర్వోలు సైతం ఆయన టార్చర్ తప్పిందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

మాట వినకపోతే ఫైళ్లు కదలవు

తహసీల్దార్ కార్యాలయంలో 1బీ అడంగల్, మ్యుటేషన్, మార్పులు, చేర్పులకు పదుల సంఖ్యలో రైతులు వస్తుంటారు. వీటికి సంబంధించిన ఫైళ్లను సిద్ధం చేసి వీఆర్వోలు ఆ అధికారి వద్దకు తీసుకువెళతారు. ఆ వీఆర్వోలు ఆ అధికారికి నచ్చితే పనులు చేస్తాడు. లేకపోతే ఏదో ఒక సాకు చూపుతూ ఫైళ్లపై సంతకం చేయకుండా ఆపేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వీఆర్వోలు పుచ్చుకున్న మామూళ్లలో ఆయకు వాటా ఇచ్చి పనులు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ అధికారికి మరో అధికారి అండగా ఉండి కొన్ని పనులు చక్కదిద్దుకుంటున్నట్లు తెలుస్తోంది. కొత్తగా వచ్చిన వీఆర్వోలకు గ్రామానికి కేటాయించడానికి కూడా ఆ అధికారి నానా కొర్రీలు వేస్తున్నాడన్న ప్రచారం ఉంది. ఒక గ్రామానికి ఉన్న అధికారిని మరొక గ్రామానికి మారుస్తూ అధికారదర్పం చూపుతున్నాడన్న విమర్శలు ఉన్నాయి. ఓ గ్రామంలో 1బీ, అడంగల్‌లో మార్పుల కోసం దరఖాస్తు రాగా, నాకు తెలియకుండా ఎలా తీసుకుంటారంటూ ఆగ్రామ వీఆర్వోపై మండిపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కార్యాలయ సిబ్బంది మొత్తం తాను చెప్పినట్లు నడుచుకోకపోతే ఇబ్బందులు పడక తప్పదంటూ హెచ్చరించినట్లు సమాచారం.

మా దృష్టికి రాలేదు

మా కార్యాలయంలో తరతమ బేధాలు ఉండవు. అలా జరుగుతున్నట్లు మా దృష్టికి రాలేదు. వస్తే అలాంటి అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. కొత్తగా వచ్చిన వీఆర్వోలకు డీఆర్వోనే పోస్టింగ్‌లు కేటాయించారు.

- శేషారెడ్డి, తహసీల్దార్

వీరుడా..! వందనం

- నేటి నుంచి పోలీస్ అమరవీరుల వారోత్సవాలు
- 31 వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణ
- ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమైన పోలీస్‌శాఖ


జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ అమరవీరుల స్తూపం

అనంతపురం క్రైం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహించే వారోత్స వాలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ సిద్ధమైంది. జిల్లా ఎస్పీ జగదీష్ పర్యవేక్షణలో ఈనెల 21 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారు. దేశ సరిహద్దులో 1959 అక్టోబరు 21న చైనాతో జరిగిన ఘర్షణలో పదిమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు వీర మరణం పొందారు. దేశం కోసం ప్రాణాలొడ్డిన ఆ వీరుల త్యాగాన్ని స్మరిస్తూ ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

● సోమవారం అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నారు. మావోయిస్టులు, ఉగ్రవాదులు తదితర అసాంఘిక శక్తులతో పాటు విధినిర్వహణలో భాగంగా అల్లర్లు, అలజడుల్లో కీలక విధులు నిర్వర్తించి ప్రాణాలు అర్పించిన పోలీస్ సిబ్బందిని స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు.

● 22 నుంచి 30వరకు పోలీసు అమరవీరుల గ్రామాలను సందర్శించనున్నారు. వారు చదివిన పాఠశాలలకు వెళ్లి అమరుల ఫొటోలు పెట్టుకునేలా సూచిస్తారు. గ్రామంలో ఏదైనా పాఠశాల, రోడ్డు, తదితర అభివృద్ధి పనులకు అమరుల పేర్లు పెట్టేలని గ్రామస్థులను కోరుతారు. అనంతరం అమరుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పించి, వారి సేవలను కొనియాడనున్నారు.

● 24 నుంచి 27 వరకు పాఠశాలల విద్యార్థులు, పోలీసు పిల్లలకు రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైం, చా లెంజెస్ ఆఫ్ పోలీస్ ఇన్ ది ప్రెజెంట్ ఎ న్విరాన్‌మెంట్ అంశాలపై జిల్లా వ్యాప్తంగా చర్చావేదికలు, వ్యాసరచన పోటీలు నిర్వ స్తారు.

● 26 నుంచి 27 వరకు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌తో పాటు సబ్ డివిజన్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల స్థాయిలో ఓపెన్ హౌస్‌లు నిర్వహించనున్నారు. పోలీసులు నిత్యం ఉపయోగించే ఆయుధాలు, సాధనాలు, పరికరాలను ప్రదర్శించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తారు. పోలీస్‌స్టేషన్లలో రికార్డుల నిర్వహణ గురించి తెలియజేస్తారు. డాగ్‌స్క్వాడ్‌కు సంబంధించిన పోలీసు జాగిలాలను మైన్‌గ్రూప్, వజ్ర, వాటర్ కేనన్ వాహనాలను ప్రదర్శనలో ఉంచనున్నారు.

ఏడాదిలో పది మంది మృతి

జిల్లాలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు అనారోగ్యాలు, రోడ్డు ప్రమాదాల కారణాలతో పది మృతి చెందారు. వారిలో కానిస్టేబుళ్లు గోవిందప్ప, సురేష్, శ్రీరామ్ నాయక్, సుంకన్న, రాజశేఖర్, హాజీ పీరా, శ్రీనివాసులు ఉన్నారు. హోంగార్డులలో నాగప్ప, చెన్నప్ప, ఆంజనేయులు ఉన్నారు. వారికి నివాళులు, శ్రద్ధాంజలి ఘటించనున్నారు.

● 28 నుంచి 30వరకు పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శనలు నిర్వహిస్తారు. పోలీసుల త్యాగాలపై సెమినార్లు/ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాటికలు, పాటల రూపంలో అమరుల త్యాగాలు వివరించనున్నారు.

● 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులను గుర్తించి వారికి సన్మానం చేసి, సేవలను ప్రశంసించనున్నారు.

● 31న సమైక్యతా భావాన్ని చాటుతూ ప్రజల సహకారంతో జిల్లా వ్యాప్తంగా సమైక్యతా దినం పాటించనున్నారు. సాయంత్రం 6గంటలకు పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నారు. దీంతో వారోత్సవాలు ముగుస్తాయి.

ఆలస్యం వద్దు

- ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపండి
- ప్రజాదర్బార్‌లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్


ప్రజల సమస్య వింటున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం అర్బన్/ అనంతపురం విద్య, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్‌కు వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్. రాజు తన నియోజకవర్గంలోని సమస్యల పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు.

కాలువ పనులకు నిధులు ఇవ్వండి

జిల్లాలోని ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లోని చెరువులకు రాగులపాడు పంప్ హౌస్ నుంచి హంద్రీనీవా నీళ్లు అందించే కాలువ పనులకు నిధులు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, రైతు సంఘం నాయకులు మంత్రిని కోరారు. జగదీష్ మాట్లాడుతూ ఆ రెండు నియోజకవర్గాల్లోని చెరువులకు రాగులపాడు పంపుహౌస్ దగ్గర నుంచి కాలువల ద్వారా కృష్ణా జలాలందించే పథకాన్ని రూపొందిస్తామని 2017లో అప్పటి సీఎం చంద్రబాబు పామిడి సభలో హామీ ఇచ్చారన్నారు. రూ. 42 కోట్లతో పనులు ప్రారంభించేలా ఉత్తర్వులు కూడా ఇచ్చారన్నారు. తర్వాత జగన్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో టెండర్లు పిలిచినా భూ సేకరణ జరగలేదన్నారు. రాగులపాడు నుంచి దోనిముక్కల, మల్లెంపల్లి, పులుగుట్టపల్లి, నెలగొండ, నల్లదాసరపల్లి, వెంకటంపల్లి, నాగసముద్రం, అయ్యవారిపల్లి, పామిడి మండలం వరకూ నీటిని అందించే ఈ కాలువ పనులు పూర్తి చేయడానికి నిధులు విడుదల చేయాలని కోరారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి దోపిడీ 6

ఉచిత సిలిండర్లు ఎవరికో..?

- దీపావళి నుంచి పంపిణీకి అడుగులు
- ఆర్భాటంగా కూటమి నేతల ప్రకటనలు
- లబ్ధిదారుల ఎంపికపై సందేహాలు
- మార్గదర్శకాలు రాలేదంటున్న యంత్రాంగం

6

టీడీపీదే హంద్రీనీవా ఘనత

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత


గ్రామస్థులతో కలిసి మరువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గానికి హంద్రీనీవా నీటిని తెచ్చిన ఘనత టీడీపీదేనని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మరువ పారుతున్న కుంటిమద్ది చెరువు వద్ద ఆదివారం ఆమె తన మనవడు పరిటాల రవీంద్ర, గ్రామస్థులతో కలిసి గంగపూజ చేశారు. హంద్రీనీవా నీటికితోడు భారీ వర్షాలు కురవడంతో చెరువులు త్వరగా నిండాయన్నారు. 2014 నుంచి 2019 వరకు జిల్లాలో అనేక చెరువులను నీటితో నింపామన్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వేరుశనగ, కంది, టమోట, బొప్పాయి వంటి పంటలకు నష్టం వాటిల్లిందని, బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును నియోజకవర్గంలో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించాలని కోరినట్లు వెల్లడించారు. ఆమె వెంట కుంటిమద్ది రంగయ్య, సుధాకర్, మారుతీప్రసాద్, ఇటికనల్లప్ప, జయచంద్రనాయుడు, రఘురాం ఉన్నారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయాధికారి


సూచనలిస్తున్న జిల్లా న్యాయాధికారి

హిందూపురం, అక్టోబరు 20: స్థానిక సబ్‌జైలును జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ ఆదివారం తనిఖీ చేశారు. ఖైదీలతో వారు చేసిన నేరాలపై ఆరాతీశారు. సబ్‌జైలులో కానిస్టేబుల్ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదాసీనంగా వ్యవహరిస్తున్న జైలు అధికారిని మందలించారు. పద్ధతి మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని న్యాయాధికారి హెచ్చరించారు.

పోలీసు భవన సముదాయం పరిశీలన

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పోలీసు భవన్ సముదాయాన్ని న్యాయాధికారి పరిశీలించారు. ఈ స్థలాన్ని పోలీసు శాఖతోపాటు బార్ అసోసియేషన్‌కు కేటాయించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. హిందూపురంలో కోర్టు కోసం భవనాన్ని పరిశీలించారు. బహువిధ పశువైద్యశాలలో పైరెండంతస్తులను పరిశీలించారు. వెటర్నరీ డీడీ కార్యాలయాన్ని సైతం పరిశీలించారు. కోర్టు నూతన భవనం నిర్మించేవరకు తాత్కాలిక భవనం వాడుకుంటామని సంబంధిత అధికారులకు న్యాయాధికారి సూచించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, హిందూపురం జిల్లా అదనపు న్యాయాధికారి శైలజ, సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి లలితాలక్ష్మి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సుకుమార్, బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళ హత్య?


గంగమ్మ మృతదేహం

అనంతపురం క్రైం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎర్రనేల కొట్టాల సమీపంలోని మహాత్మాగాంధీ కాలనీలో శనివారం రాత్రి ఓ మహిళ హత్యకు గురైంది. కాలనీలో నివాసముంటున్న గంగమ్మ(50) తన పేరు నాగమ్మగా చెప్పుకుంటోంది. శెట్టూరు మండలం ఉప్పువంకకు చెందిన ఈమె 20 ఏళ్ల కిందట భర్త, పిల్లలను వదిలేసి అనంతపురానికి వచ్చి స్థిరపడింది. ఆమె రామచంద్రనగర్‌లోని నీలిమా థియేటర్ సర్కిల్ సమీపంలోని ఓ హోటల్‌లో పని చేస్తోంది. హోటల్‌లో శనివారం ఉదయం 11గంటలకు పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు ఆదివారం ఉదయం హోటల్ యజమాని రమేష్ ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఇంటి యజమానికి ఫోన్ చేసి విషయం తెలిపాడు. యజమాని ఆమె ఇంటి వద్దకు వెళ్లి చూడగా బెడ్‌పై నిస్తేజంగా పడిఉన్న నాగమ్మ కనిపించింది. ఆమె ముక్కునుంచి రక్తం కారడం చూసి వెనక్కు వచ్చి, హోటల్ యజమాని, పోలీసులకు సమాచారం అందించాడు. జిల్లా ఎస్పీ జగదీశ్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ శాంతిలాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించారు. డాగ్ ఇంటిపై నుంచి కింది వరకు వచ్చి కొంత దూరం వెళ్లి తిరిగి వచ్చింది. త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కారంపొడి చల్లిన దుండగులు

హత్యకు గురైన గంగమ్మ ఏడాది కిందటి వరకు అదే కాలనీలోని మూడు సందుల అవతల ఇంట్లో అద్దెకు ఉండేది. ప్రస్తుతం మరో ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఆమె ఇక్కడ పూజలు చేసేదని, స్వామి పూనకం వచ్చేదని స్థానికులు చెబుతున్నారు. ఆమెపై అత్యాచారం జరిగి ఉంటుందనే అనుమానాలు రేకెత్తాయి. పోస్టుమార్టంలో అవేవీ లేవని, గొంతు నులిమి హత్య చేసి ఉండవచ్చని తేలినట్లు సమాచారం. స్థానికంగా ఆమెకు పరిచయమున్న వారే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అయితే అది వివాహేతర సంబంధమా..? లేక ఆర్థిక వ్యవహారమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు పాల్పడిన వారు కారం పొడి చల్లడం అనుమానాలకు తావిస్తోంది. కుక్క ఆ వాసన గుర్తు పట్టకుండా ఉండేందుకే ఇలా చేసినట్లు పోలీస్‌వర్గాలు భావిస్తున్నాయి. హత్యలో పాల్గొన్నది ఒకరా, ఇద్దరా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. గంగమ్మ మృతి సమాచారాన్ని కుమారులకు అందించారు. వారు వచ్చాకే పోస్టుమార్టం నిర్వహించారు. భర్త నాగప్ప కొన్నేళ్ల కిందటే మృతి చెందినట్లు తెలిసింది.

మున్సిపాలిటీకి ఇచ్చేయండి

తల్లి మృతదేహం తీసుకెళ్లడానికి ఆమె ఇద్దరు కుమారులు అంగీకరించలేదు. ఆమె కూలి పనులు చేయలేక లగ్జరీ కోసమని మమ్మల్ని చిన్నప్పుడే వదిలేసి వచ్చింది. అలాంటి ఆమెను తీసుకెళ్లలేమంటూ ఆ కొడుకులు విముఖత చూపారు. మున్సిపాలిటీ వారికి ఇచ్చేయండి వారే చూసుకుంటారంటూ పోలీసులకు చెప్పారు. అలా అంటారేంటి ఎంతయినా ఆమె మీ కన్నతల్లి అంటూ సీఐ శాంతిలాల్ నచ్చచెప్పారు. దీంతో బాడుగకు కూడా మా వద్ద డబ్బు లేవంటూ ముఖం చిట్లించారు. దీంతో మేమే బాడుగ ఇస్తాం అని చెప్పి, మృతదేహాన్ని ఇచ్చి పంపారు.


వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ జగదీశ్

ఉచిత సిలిండర్లు ఎవరికో..?

- దీపావళి నుంచి పంపిణీకి అడుగులు
- ఆర్భాటంగా కూటమి నేతల ప్రకటనలు
- లబ్ధిదారుల ఎంపికపై సందేహాలు
- మార్గదర్శకాలు రాలేదంటున్న యంత్రాంగం



అనంతపురం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు శుభవారం చెబుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా మూడు సిలిండర్ల పంపిణీకి అడుగులు వేస్తోంది. ఇప్పటికే పించన్లు పెంచారు. దీపావళికి సిలిండర్లు పంపిణీ చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. దీనిపై కూటమి పార్టీల నేతలు సమావేశాల్లో ప్రజలకు చెబుతున్నారు. ఎవరెవరికి ఉచితగ్యాస్ సిలిండర్లు అందజేస్తారనే దానిపైనే ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఇంకా మార్గదర్శకాలు రాలేదని పౌర సరఫరాల శాఖ అధికారులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 12,54,911 కనెక్షన్లు

అనంత ఉమ్మడి జిల్లాలో 12,54,911 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని పౌర సరఫరాల శాఖ అధికారుల రికార్డులు చెబుతున్నాయి. ఇందులో జనరల్ కనెక్షన్లు 7,48,218 ఉండగా, దీపం పథకం కింద 4,09,764, అంత్యోదయ సామాజిక బాధ్యత కింద ఇందన కంపెనీలకు సంబంధించి 68,451, ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద 28,478 కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.869 ఉంది.

ఈకేవైసీనే కీలకమా..?

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో లబ్ధిదారుల ఈకేవైసీనే కీలకమనే అభిప్రాయాలు అధికార యంత్రాంగం ద్వారా తెలుస్తోంది. అందుకే ప్రభుత్వం కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరి నుంచి ఆధార్ ఆధారంగా ఈకేవైసీ చేయించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో మూడు నెలలుగా లబ్ధిదారుల నుంచి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఈకేవైసీ చేయిస్తూ వస్తున్నారు. ఈకేవైసీ చేయించడం వల్ల లబ్ధిదారుడికి సంబంధించిన ఆదాయం, ఆస్తుల స్టేటస్ తెలుసుకోవచ్చు. తెల్లకార్డు ఉన్నవారందరికీ ఈ సిలిండర్లు అందజేస్తారా అనే దానిపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆశా, అంగన్‌వాడీల్లో ఉత్కంఠ

గత వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ప్రకటించింది. తమకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ఆ వర్గాల వారు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఉచిత సిలిండర్లు తమకు వర్తింపజేస్తారో లేదోనని వారు ఉత్కంఠగా చూస్తున్నారు.

మార్గదర్శకాలు రాలేదు: వెంకటేశ్వర్లు, డీఎస్ఓ

ఉచితగ్యాస్ సిలిండర్ల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు దానికి సంబంధించిన మార్గదర్శకాలు రాలేదు. అవి వచ్చిన తర్వాతనే ఎవరెవరికి సిలిండర్లు పంపిణీ చేస్తామో తెలుస్తుంది. ఎపుడు ఆదేశాలు వచ్చినా మార్గదర్శకాల మేరకు పంపిణీ చేపట్టడానికి అన్నిరకాలుగా సిద్ధంగా ఉన్నాం.

యథేచ్ఛగా ఎర్రమట్టి దోపిడీ

- కొండలను కరిగించి
- సొమ్ము చేసుకుంటున్న మాఫియా
- పట్టించుకోని అధికారులు


ఎక్స్‌కవేటర్ ద్వారా కొండను కరిగిస్తున్న దృశ్యం

నార్పల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్న కొందరు అక్రమార్కులు కొండలను కరిగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల కేంద్రమైన నార్పలలోని సరిహద్దుల్లో ఎర్రమట్టి కొండలు చాలా ఉన్నాయి. కొందరు ఎర్రమట్టి దొంగలు రూ. లక్షలు సంపాదించడానికి మాఫియాగా మారారు. ఎర్రమట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా నార్పల మండలమే కాకుండా ఇతర మండలాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు నాయకులు, అధికారులు వారి నెల మామూళ్లు సర్దుబాటు చేసుకుని ఎర్రమట్టి మాఫియాకు మద్దతు ఇస్తున్నట్లు సమాచారం. కొండలను ఇష్టానుసారంగా ఎక్స్‌కవేటర్లతో తవ్వేసి ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా విక్రయిస్తున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. నార్పలలో కొన్ని కొండలను తవ్వి ఎర్రమట్టిని తరలించడం కోసం కొందరు ఎర్రమట్టి మఫియా సభ్యులు ఇటీవల ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఒక ట్రాక్టర్ తెచ్చుకున్న వ్యక్తి ఎర్రమట్టిని తరలిస్తే రోజుకు రూ.10వేలు వరకు సంపాదిస్తున్నాడని సమాచారం. ఈ ఎర్రమట్టిని రియల్ ఎస్టేట్ వెంచర్లు, పాతబావులు, గుంతలు, చౌడు భూములు, తోటలు, రోడ్లకు ఎక్కువగా వాడుతున్నారు. ఎర్రమట్టి తరలించే మాఫియాలో వైసీపీకి చెందిన వారే ఉన్నట్లు సమాచారం. ఈ విషయం గురించి తహసీల్దారు అరుణకుమారిని వివరణ కోరగా.. అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలా ఎవరైనా కొండల నుంచి ఎర్రమట్టిని తరలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఆమె తెలిపారు.


నార్పలలో ట్రాక్టర్‌తో ఎర్రమట్టిని తరలిస్తూ...

అడ్డేలేని అక్రమాలు..!

- కనిపించని రికార్డులు
- సొసైటీల కంప్యూటరీకరణతో వెలుగులోకి..
- నకిలీ పాసుబుక్కులతో రుణాలు
- అనంతలో 48, శ్రీసత్యసాయిలో 65 శాతమే ఆన్‌లైన్
- ఓటర్లు 15 లక్షలు.. ఖాతాదారులు 80 వేలు..
- కొలిక్కిరాని ప్రక్రియ
- కొత్త రుణాలు ఇవ్వడంలో ఆలస్యం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఇచ్చిన రుణాల్లో అక్రమాలకు అడ్డేలేకుండా పోయింది. సొసైటీల కంప్యూటరీకరణతో రికార్డులు లభించడం లేదని తెలుస్తోంది. సుమారు ఐదేళ్లుగా సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ సాగిస్తున్నప్పటికీ నేటికీ కొలిక్కిరావడం లేదు. దీంతో సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. అనంతపురం జిల్లాలో 48 శాతం, శ్రీసత్యసాయి జిల్లాలో 65 శాతం సొసైటీల కంప్యూటరీకరణ పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో 107 సొసైటీలలో 15 లక్షల మంది ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 80వేల మంది మాత్రమే రైతులు ఖాతాదారులుగా ఉన్నట్లు సహకార శాఖ, ఏడీసీసీ బ్యాంకు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయితే ఇంకా చాలా అవినీతి, అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. ఇందులో నకిలీ పట్టాలు, బోగస్ రుణాలు తేలనున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియలో జరుగుతున్న నిర్లక్ష్యం, జాప్యంతో అర్హులైన రైతులకు రుణాలు ఇవ్వడంలో ఆలస్యమవుతోంది. సమస్యను పరిష్కరించేదిశగా జిల్లా యంత్రాంగం దృష్టి సారించాల్సి ఉంది. గతంలో ఇష్టానుసారంగా నకిలీ పాసుబుక్కులకు రుణాలు చెల్లించారు. దీంతోనే రికార్డులను మాయం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినా అధికారులు దీనిపై దృష్టి సారించలేదనే విమర్శలు ఉన్నాయి.



15 లక్షల ఓటర్లు.. 80 వేలే ఖాతాదారులు..

ఉమ్మడి జిల్లాలో 107 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (సొసైటీలు) ఉన్నాయి. వీటిలో సుమారు 15 లక్షల మందికి పైగా ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 80వేల మంది మాత్రమే పంట రుణాలు తీసుకున్నారు. చాలా వరకు నకిలీ, బోగస్ ఓటర్లు ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. గ్రామస్థాయిలోకి వెళితే సొసైటీలలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. సొసైటీల ఆన్‌లైన్ ప్రక్రియలో జరుగుతున్న జాప్యంతో అర్హులైన రైతులకు రుణాలు చెల్లించడం ఆలస్యమవుతోంది.

వేగవంతంగా కంప్యూటరీకరణ

ప్రభుత్వ ఆదేశాల మేరకు సొసైటీల కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం. పలు రికార్డులు లభించడం లేదని కిందిస్థాయి సిబ్బంది చెబుతున్నారు. నకిలీ, బోగస్ అని తెలిస్తే వెంటనే నోటీసులు ఇస్తున్నాం. నోటీసుల ద్వారా సంబంధిత రుణాలు తీసుకున్న వారి నుంచి స్పష్టత తీసుకుంటున్నాం. రికార్డులు లేకపోతే కచ్చితంగా సంబంధిత సొసైటీలు, బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేస్తే సొసైటీల పారదర్శకత, రుణాల చెల్లింపుల్లో అక్రమాలను ఏరిపారేయవచ్చు.

-అరుణకుమారి, కృష్ణానాయక్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల డీసీఓలు


నాట్యంతో అలరిస్తున్న అలా వేణుగోపాల్

నెమలికి నేర్పిన నడకలివి..

అనంతపురం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం మొదటి రోడ్డులోని త్యాగరాజ సంగీత సభలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన 'అంకురం శాస్త్రీయ సంగీత నృత్య వేడుకలు' వీక్షకుల్లో నాట్యానందాన్ని నింపాయి. కార్యక్రమానికి చిన్మయామిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కేరళకు చెందిన నృత్యకళాకారిణి అలా వేణుగోపాల్ శాస్త్రీయ సంగీతానికి సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో సంగీతసభ అధ్యక్షుడు ఎన్‌సి సంపత్‌కుమార్, ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, కవి కంబదూరి షేక్ నబిరసూల్, దాసరి హరిశ్చంద్ర రామ తదితరులు పాల్గొన్నారు.

కరువు తీరా నీరు

బోరు బావి నుంచి ఉబికి వస్తున్న జలం

కనగానపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కరువు సీమలో పాతాళం నుంచి జలం ఉబికి వస్తోంది. బోరు బావిలో నుంచి మోటరు ఆన్ చేయకనే నీరు ఉబికి వస్తుండంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా వర్షాలు కురస్తుండంతో కనగానపల్లి మండలం తూంచెర్ల గ్రామంలో దోబీఘాట్ కోసం వేసిన బోరుబావి నుంచి నీరు ఉబికి వస్తోంది. కరువు తీరేలా భూగర్భ జలాలు పెరగడంతో రైతులు, గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


తూంచెర్ల గ్రామంలో బోరుబావిలో వస్తున్న నీరు

మెరిట్ జాబితాపై అభ్యంతరాలు చెప్పండి

అనంతపురం విద్య, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి సంబంధించిన విడుదల చేసిన తాత్కాలిక మెరిట్ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21వ తేదీలోగా తెలియజేయాలని సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించామన్నారు. స్క్రూట్నీ తర్వాత అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను సమగ్రశిక్ష బ్లాగ్ స్పాట్ http : //samagrashikshaatp.blogspot.comలో అందుబాటులో ఉంచామన్నారు. జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సోమవారం సాయంత్రం 4 గంటల్లోపు సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

ఇంకెవరు చెప్పాలి..?





ఈ ఫొటోలో కనిపిస్తున్నది కూడేరు మండలం అరవకూరుకు చెందిన పెద్దయ్య. ఊపిరి ఆడకపోవడం, ఛాతీలో తీవ్రనొప్పితో నడవడానికి ఇబ్బంది పడుతున్న అతడిని భార్య, మరొకరు కలిసి ఆటోలో జిల్లా ఆస్పత్రికి శనివారం తీసుకొచ్చారు. ఓపీ చీటీ తీసుకొని డాక్టర్ వద్దకు వెళ్లగా పరీక్షించి మాత్రలు రాసిచ్చి పంపించారు. అయినా బాధ తగ్గకపోవడంతో అడ్మిట్ చేసుకోమని అడిగారు. ఇప్పుడు బెడ్లు ఖాళీలేవు, సోమవారం రండి అని డాక్టర్ చెప్పారంట..! దీంతో ఆయన భార్య 'ఇదేమి ఆస్పత్రిసారూ చచ్చిపోతున్నా పట్టించుకోరా? అని వాపోయింది. మాఖర్మ, ఆరోజే వస్తాం అంటూ ఉబికి వస్తున్న కన్నీటి అదిమిపెట్టుకుంటూ వెళ్లిపోయింది.

ఈమె పేరు లక్ష్మీదేవి. ఊరు తాడిపత్రి. ముక్కులు మూసుకుపోవడంతో ఊపిరి తీసుకోవడానికి అవస్థలు పడుతోంది. చికిత్స కోసం శుక్రవారం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. డాక్టరమ్మ పరీక్షించి సీటీస్కాన్ తీయించుకొని రమ్మని రాసిచ్చారు. అదేరోజే స్కానింగ్ చేశారు. కానీ రిపోర్టు ఇవ్వలేదు. దీంతో తాడిపత్రికి వెళ్లి శనివారం మళ్లీ ఆస్పత్రికి వచ్చి సీటీ స్కానింగ్ సెంటర్ వద్ద కాచుకున్నారు. అప్పటికీ రిపోర్టు సిద్ధం కాలేదు. అడిగితే సోమవారం రమ్మన్నారట. డాక్టరమ్మేమో స్కానింగ్ రిపోర్టు చూసిన తర్వాతేమందులు రాసిస్తానంటున్నారు. వీళ్లు చూస్తూ రిపోర్టుకు రేపుమాపు అంటూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.





ఇక్కడ కనిపిస్తున్న ఇద్దరు మహిళల చిన్నపిల్లలు అనారోగ్యంతో చిన్నపిల్లల వార్డులో చికిత్స పొందుతున్నారు. అక్కడ ఏవో పరీక్షలు చేయించాలని డాక్టరు రాసిచ్చారు. నర్సులు రక్త నమూనాలు తీసి ల్యాబ్ ఇచ్చిరావాలని చెప్పారట. దీంతో వారు శాంపిల్స్‌ను తీసుకుని బయోకెమిస్ట్రీల్యాబ్ వద్దకు వచ్చారు. అక్కడి వారు ఈ శాంపిల్స్ ఇక్కడ కాదు 19 ఓపీలోని మైక్రోబయాలజీలో ఇవ్వాలని చెప్పారట. అక్కడనుంచి అందరినీ ఆవార్డు ఎక్కడుందని అడుక్కుంటూ ఆ మహిళలు వెళుతూ కనిపించారు.

- మంత్రి చెప్పినా మారని పెద్దాస్పత్రి తీరు
- సకాలంలో అందని రిపోర్టులు, వైద్యసేవలు
- పేద రోగులకు తప్పని తిప్పలు

మంత్రి చెబుతున్నా..

ఆస్పత్రికి వచ్చిన ప్రతిరోగికి సకాలంలో వైద్యసేవలు అందాలని, ఎట్టి పరిస్థితులలోను బయటకు పంపకూడదు. ఏమైన పరీక్షలు, స్కానింగ్ రిపోర్టులను ఏరోజుకారోజే పేషెంట్లకు అందించి సంబంధిత డాక్టర్లతో అవసరమైన వైద్యచికిత్సలు పొందేలా చూడాలి. ఇవీ రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ పెద్దాస్పత్రిలో చెప్పిన మాటలు. ఇవి విన్న రోగులు, వారి బంధువులు మంత్రి చెప్పారు కాబట్టి ఇక మీదట ఆస్పత్రి సిబ్బంది తీరు మారుతుందని ఎంతో సంబరపడ్డారు. కానీ ఆస్పత్రిలో పనితీరుమాత్రం ఏమాత్రం మారలేదు.

రిపోర్టుల జారీపై తీవ్ర నిర్లక్ష్యం

డాక్టర్లు వివిధ స్కానింగ్‌లు తీయించుకొని రావాలని పేషెంట్లకు రాస్తున్నారు. అల్ట్రా సౌండు, సీటీస్కాన్, ఎంఆర్‌ఐ తదితర పరీక్షలు ఇందులో చాలా కీలకం. ఈరిపోర్టులు వస్తేగానీ పేషెంట్లకు అవసరమైన చికిత్సలు అందించడానికి వీలుకాదని డాక్టర్లు అంటున్నారు. అందుకే రిపోర్టులను సకాలంలో అందించి, అదేరోజు వచ్చిన పేషెంట్లకు చికిత్స అందేలా చూడాలని వైద్యమంత్రి ఆదేశించారు. కానీ ఇక్కడ ఆస్పత్రిలో మంత్రి చెప్పిన

అనంతపురం టౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి)

ప్రకారం రిపోర్టులు రోగులకు అందించడం లేదు. దీనికి కారణం అల్ట్రాసౌండు, సీటీస్కాన్, ఎంఆర్‌ఐ పరీక్షలు రోజుకు ఇన్ని మాత్రమే చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. లక్ష్యానికి మించి పేషెంట్లు స్కానింగ్‌లకు రావడం వల్ల సమయానికి ఇవ్వలేకపోతున్నామని ఆయా విభాగాల వైద్యులు, సిబ్బంది అంటున్నారు. ఈసమస్య పరిష్కారమవ్వాలంటే మరిన్ని మెషీన్లు, వైద్యులు, సిబ్బంది అవసరమని చెబుతున్నారు.

ఇష్టారాజ్యంగా ల్యాబ్ రిపోర్టులు

సీజనల్ వ్యాధులు, ప్రసవాలకు వచ్చే వారు, ఇతర విభాగాలలో అడ్మిషన్ పొంది చికిత్స పొందుతున్న రోగులకు వివిధ రకాల రక్త పరీక్షలు ఎంతో అవసరం. ఆస్పత్రిలో రోజుకు 2వేలకు పైగా బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ ల్యాబ్‌లకు రక్త పరీక్షల కోసం శాంపిళ్లు వస్తున్నాయంటే రోగుల తాకిడి ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. ల్యాబ్‌టెక్నీషియన్లు. ల్యాబ్‌అసిస్టెంట్లు, ల్యాబ్ అటెండర్లు రక్త పరీక్షల శాంపిళ్లు తీసుకొని, ల్యాబ్ రిపోర్టులను సంబంధిత విభాగాల డాక్టర్లకు అందించాలి. కానీ ఇక్కడ ఆస్పత్రిలో ల్యాబ్‌కు సంబందించిన అసిస్టెంట్లు, అటెండర్లు ఎక్కడ ఉంటారో తెలియ డం లేదు. శిక్షణకు వచ్చిన విద్యార్థులతోనే ఈపనులన్నీ చేయిస్తున్నారు. ఇంకోవైపు ఇన్‌పేషెంట్లు ఉన్నవార్డులకు ప్రత్యేకంగా డ్యూటీలు వేస్తారు. ఆయా విభాగాల డాక్టర్లు పేషెంట్లకు ఏమైనా పరీక్షలు రాస్తే ఆల్యాబ్ అసిస్టెంట్ రక్తం శాంపిల్ తీసుకొని, ఆయనకానీ, అటెండర్‌తోగానీ ల్యాబ్‌కు పంపించాలి. ఈ ఆస్పత్రిలో చాలా విభాగాలలో అలా చేయడంలేదు, నర్సులే రక్తం శాంపిల్ తీసి రోగి బంధువుల ద్వారా ల్యాబ్‌లో ఇచ్చిరావాలని పంపిస్తున్నారు. దీంతో రోగి బంధువులు ఎక్కడ ఆ శాంపిల్ ఇవ్వాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ శాంపిల్‌కు వేసిన లేబుల్ మారితే సరికొత్త సమస్యలు వస్తాయి. ఇప్పటికే అనేక సార్లు ఒకరి రిపోర్టు మరొకరికి ఇచ్చిన సందర్భాలు అనేకం బయటపడ్డాయి. అయినా ఈరక్త శాంపిళ్ల విషయంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తుండటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్ వద్ద రోగుల తాకిడి

క్రైం కార్నర్

తండ్రిని చంపిన తనయుడు

- రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- డయల్ 100కు ఫోన్‌తో కుట్రకోణం బట్టబయలు


బొమ్మన్న(ఫైల్)


రాయదుర్గం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రినే కడతేర్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి అడ్డంగా దొరికిపోయిన సంఘటన రాయదుర్గంలో చోటు చేసుకుంది. తండ్రి బొమ్మన్న(52)ను గుట్టుగా చంపేసి రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసి దొరికిపోయాడు. వివరాల్లోకి వెళితే.. రాయదుర్గం పట్టణానికి చెందిన బొమ్మన్న కర్ణాటకలోని పెదారుగుడ్డం గ్రామంలో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. రోజూ ఉదయం ద్విచక్రవాహనంలో వెళ్లి సాయంత్రానికి పొలం పనులు చూసుకుని ఇంటికి చేరుకునేవాడు. శనివారం కూడా పెదారుగుడ్డం నుంచి రాయదుర్గానికి వాహనంలో వస్తుండగా మార్గమధ్యంలోని మల్లాపురం తండా శివారులో ద్విచక్రవాహనం నుంచి కిందకు పడి మృతి చెందాడు. కాలికి రక్తగాయాలు మినహా మిగిలిన చోట ఎక్కడ గాయాలు లేవు. ద్విచక్రవాహనం కూడా ఎక్కడా దెబ్బతినలేదు. రోడ్డు ప్రమాదంలో తండ్రి చనిపోయాడని, అటువైపు వచ్చేవారు కొడుకుకు ఫోన్ చేయడంతో అతను ఒంటరిగా ఆటోలో వెళ్లి తండ్రిని తీసుకొచ్చి రాయదుర్గం ఆసుపత్రిలో చికిత్సలు అందించే ప్రయత్నం చేయగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు సైతం రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని భావించారు. ఇంత వరకూ బాగానే ఉంది.. అసలు ట్విస్టు ఇక్కడే బయట పడింది.. బొమ్మన్న తనపై దాడి జరుగుతుండగా డయల్ 100 ఫోన్ చేసి తనను తన కొడుకు చంపే ప్రయత్నం చేస్తున్నాడని తెలిపాడు. రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని భావించిన పోలీసులకు ఆ ఫోన్‌కాల్ కొడుకు నాగరాజును అదుపులో తీసుకునేలా చేసింది. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఆదివారం నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. దీని వెనుక తండ్రి కొడుకు మధ్య కుటుంబ కలహాలే కారణంగా తెలుస్తోంది. మల్లాపురం తండా వద్ద తండ్రిని అడ్డుకుని వాగ్వాదం చేశాడు. రోడ్డు పక్కన పొలంలో ఇద్దరి మధ్య గొడవ తీవ్రస్థాయిలో జరిగి తండ్రిని గొంతునులిపి చంపే ప్రయత్నం చేస్తుండడంతో ఫోన్ ద్వారా డయల్ 100కు తన కొడుకు చంపుతున్నాడని ఫిర్యాదు చేసి ఫోన్ పారవేశాడు. తండ్రిని హతమార్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి అక్కడి నుంచి జారుకున్నాడు. ఏమీ తెలియనట్లుగా వచ్చి ఇంటికి చేరుకోగా తండ్రి చనిపోయిన విషయం ఫోన్‌లో బాటసారులు తెలిపితే వెంటనే ఆటో వేసుకొని వెళ్లి శవాన్ని తీసుకురావడం నాటకీయ వ్యవహారాన్ని నడిపేశాడు. దీనిపై పోలీసులు కొడుకు నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


జయశ్రీ (ఫైల్)

పుట్లూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాపురంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. బాలాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి, సరళ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఒక కుమారుడు సంతానం. పెద్ద కుమార్తె జయశ్రీ అనంతపురంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వచ్చింది. గణితంలో సరిగా రాణించలేకపోతున్నట్లు తల్లిదండ్రులతో తరచూ బాధపడేది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆమె శనివారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబసభ్యులు కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

చేపల వేటకెళ్లి వ్యక్తి మృతి


బయ్యప్ప (ఫైల్)

కదిరి అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలచెరువు గ్రామానికి చెందిన బయ్యప్ప(57) చేపల వేటకు వెళ్లి మరణించాడు. శనివారం రాత్రి ఇతను మరికొందరు గ్రామస్థులతో కలిసి చెరువు వద్దకు వెళ్లారు. రాత్రి సుమారు పది గంటలకు గ్రామస్థులందరూ ఇళ్లకు బయలుదేరగా.. అతను మళ్లీ వస్తానని చెప్పడంతో వారంతా గ్రామానికి వచ్చారు. ఆదివారం ఉదయమైనా అతను ఇంటికి రాకపోవడంతో గ్రామస్థులు వెళ్లి.. చెరువులో గాలించారు. కాళ్లకు వల చిక్కుకొని అతని మృతదేహం చెరువులో ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు.. మృతదేహాన్ని వెలికితీసి, కదిరి ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ మోహన్ తెలిపారు. బయ్యప్పకు భార్య అలివేలమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అప్పుడే... మొదలెట్టేశారు..!



- పల్లెల్లో వెలుస్తున్న బెల్టుషాపులు
- మద్యం దుకాణం లేనిచోట అమ్మకాలు ప్రారంభం
- పోటీపడుతున్న ఇరుపార్టీల నాయకులు
- ముఖ్య నేతలకు తలనొప్పిగా మారిన వైనం



హిందూపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నడూలేనివిధంగా ఈసారి మద్యం దుకాణాలకు లైసెన్సు ఫీజు భారీగా పెంచడంతో వ్యాపారులు బెల్టు షాపులకు తెరతీస్తున్నారు. లైసెన్సు దుకాణాలు లేనిచోట్ల చాటుమాటుగా మద్యం అమ్మకాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక పెద్దలను కలిసి, వారిని ఒప్పిస్తూ ఇరుపార్టీల చోటామోటా నాయకులకు బెల్టుషాపులు అప్పజెప్పేందుకు సిద్ధమవుతున్నారు. మద్యం సరఫరా, అమ్మకాలకు ఆటంకం లేకుండా చూడాలని వ్యాపారులు.. పల్లెల్లో ఇరుపార్టీల నాయకులను పంపిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జే బ్రాండ్లతో ఆరోగ్యాలు దెబ్బతీశారనీ, కూటమి ప్రభుత్వం వచ్చాక నాణ్యమైన మద్యం ఇస్తామంటూ ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. గత వైసీపీ హయాంలో ప్రభుత్వం సొంతంగా మద్యం వ్యాపారం చేసింది. నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించింది. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రైవేటు దుకాణాలకు అనుమతి ఇచ్చింది. అధికారంలోకి వస్తే ప్రముఖ కంపెనీల మద్యాన్ని అందుబాటులోకి తెస్తామనీ, తక్కువ ధరలకే విక్రయించేలా చర్యలు చేపడతామని ఎన్నికలకు ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఆ మేరకు నూతన మద్యం పాలసీని ఇటీవల ప్రకటించి, ఈనెల 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలను అందుబాటులోకి తెచ్చింది. దీంతో మందుబాబులు హర్షం వ్యక్తం చేశారు. లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వారు.. వ్యాపారం విస్తరించుకునేందుకు పలు మార్గాలను అన్వేషిస్తున్నారు. దుకాణాలులేని గ్రామాలు, పట్టణ శివారు ప్రాంతాల్లో విక్రయాలకు ఏర్పాట్లు మొదలు పెట్టారు. వైసీపీ హయాంలో గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయి. అధిక ధరకు విక్రయించారు. కూటమి పాలనలో కూడా బెల్టుషాపులకు తెరతీస్తున్నారు. లాటరీ ద్వారా మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు.. బెల్టు అమ్మకాల కోసం గ్రామాల్లో నాయకులను సంప్రదించి, వ్యాపారానికి సహకరించాలని కోరుతున్నట్లు సమాచారం.



నాయకుల పోటీ

పల్లెల్లో మద్యం విక్రయించేందుకు ఇరుపార్టీల నాయకులు పోటీపడుతున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఐదేళ్లుగా కూటమి నాయకులకు ఆదాయం లేకపోవడంతో మద్యం అమ్మకాలకు పోటీపడుతున్నారు. కొన్నిచోట్లయితే ముందుగానే రూ.50వేల నుంచి రూ.లక్ష దాకా మద్యం స్టాక్ కోసం డిపాజిట్ చేస్తున్నారు. గ్రామాల్లో అధికార పార్టీ మాత్రమే బెల్టుషాపు ద్వారా విక్రయిస్తే ఇబ్బందులు వస్తాయని భావించి, వైసీపీ నాయకులకు సైతం వాటాలు ఇస్తున్నారు. ఇలాంటి వ్యవహారాలు హిందూపురం, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లో సాగుతున్నట్లు సమాచారం.

ముఖ్య నేతలకు తలనొప్పి

గతంలో మద్యం వ్యాపారం కొంతమందికే పరిమితమై ఉండేది. ఇందులోకి ఇతర నాయకులెవరూ జోక్యం చేసుకునేవారుకాదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొంతమంది అక్రమ మద్యం వ్యాపారంతో రూ.లక్షలు సంపాదించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, సంపాదన కోసం ఆరాట పడుతున్నట్లు తెలుస్తోంది. ఒకే గ్రామంలో నలుగురైదుగురు బెల్టుషాపుల కోసం పోటీపడుతుండటం ఆయా నియోజకవర్గాల ముఖ్య నేతలకు తలనొప్పిగా మారింది. అసలు ఈసారి స్థానిక ఎన్నికల సందర్భంగా టిక్కెట్ల కోసం పోటీపడినట్లు బెల్టుషాపులకు పోటీపడటం విశేషం.

రైఫిల్ షూటింగ్ జాతీయ జట్టు ఎంపిక

దివాన్‌చెరువు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఓపెన్‌సైట్ కేటగిరి విభాగంలో పాల్గొనే జాతీయ జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఏపీ పాఠశాల విద్యశాఖ, క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో రాజానగరం మండలం సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగుతున్న ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ ఆదివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపికైన రాష్ట్ర జట్టును ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి ప్రకటించారు. ఓపెన్ సైట్ కేటగిరిలో అండర్-14 బాలికల విభాగంలో వి.జాగృతిరెడ్డి(వైఎస్ఆర్ కడప), ఎస్.జోహసిద్రా(తూర్పుగోదావరి), డి.సౌమ్యశ్రీ (పశ్చిమగోదావరి), అండర్-14 బాలురు విభాగంలో ఎ.లిఖిత్‌రామ్ (పశ్చిమగోదావరి), డి.వేద్‌వీక్షిత్(తూర్పుగోదావరి), వి.తీక్షణసాయి (అనంతపురం) ఎంపికయ్యారని స్వామి తెలిపారు. అలాగే అండర్-17 బాలికల విభాగంలో ఎం.సాయి ఐశ్వర్య(కర్నూలు), సి.గురుప్రవళ్లిక(అనంతపురం), వి.ఫైజాసుల్తానా(వైఎస్ఆర్ కడప), అండర్-17 బాలుర విభాగంలో ఎస్ఎండీ ఉబయిద్(వైఎస్ఆర్ కడప), పి.సాయి సుమేష్(తూర్పుగోదావరి), ఎల్.రామ్‌జిగ్నేష్(కర్నూల్) ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్-19 బాలికల విభాగంలో ఎస్‌డీ మహేజమీన్(వైఎస్ఆర్ కడప), ఎం.పల్లవి (కర్నూల్), ఎం.మల్లికాబాయ్(అనంతపురం), అండర్-19 బాలురు విభాగంలో ఏవీ సూర్య రామసంజీవరెడ్డి(వైఎస్ఆర్ కడప), టి.వెంకటఅఖిల్ (అనంతపురం), డి.సాయితేజ(తూర్పుగోదావరి) ఎంపికయ్యారన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌లు అనంతపురం, కర్నూల్, వైఎస్ఆర్ కడప జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయని స్వామి తెలిపారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో ఎంపికైన జట్టు డిసెంబరు 24 నుంచి వచ్చేఏడాది జనవరి ఒకటో తేదీ వరకూ భోపాల్‌లో జరిగే జాతీయపోటీల్లో పాల్గొంటుందని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి తెలిపారు. ఓపెన్‌సైట్ కేటగిరిలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి నారాయణ, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి స్వామి, పీఈటీలు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ ఓపెన్‌సైట్ కేటగిరిలో విజేతలు వీరే

అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీలలో ఓపెన్‌సైట్ విభాగంలో విజేతల వివరాలను జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి ఆదివారం ప్రకటించారు. సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో జరుగుతున్న ఈ పోటీల్లో.. అండర్-14 బాలికల విభాగంలో కర్నూలు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా, అనంతపురం జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. అండర్-14 బాలురు విభాగంలో పశ్చిమగోదావరి, కర్నూలు, అనంతపురం జిల్లాల జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. అండర్-17 బాలికల విభాగంలో వైఎస్ఆర్ కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. అండర్-17 బాలురు విభాగంలో కర్నూలు, తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. అండర్ 19 బాలికల విభాగంలో వైఎస్ఆర్ కడప, అనంతపురం, కృష్ణా జిల్లాల జట్లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. అండర్-19 బాలుర విభాగంలో అనంతపురం జిల్లా జట్టు మొదటి బహుమతిని, వైఎస్ఆర్ కడప జిల్లా జట్టు రెండో బహుమతిని, చిత్తూరు జిల్లా జట్టు మూడో బహుమతి సాధించాయని స్వామి తెలిపారు. వీరికి ఉపవిద్యాశాఖాధికారి నారాయణ, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ టి.స్వరూప్‌రెడ్డి తదితరులు బహుమతులు అందజేశారు.


ఓపెన్‌సైట్ కేటగిరీలో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన అనంతపురం జట్టు

మరుగుదొడ్ల సొమ్ము.. స్వాహా..!


కనగానపల్లి వెలుగు కార్యాలయం

- కనగానపల్లి వెలుగులో గోల్‌మాల్
- గ్రామ సంఘం నిధుల్లో భారీ అవినీతి
- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- అధికారులతో ఆ పార్టీ నాయకుల కుమ్మక్కు


కనగానపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించాలన్న ఆశయంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన నిధులను వైసీపీ హయాంలో స్వాహా చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కనగానపల్లి మండలం చంద్రాచర్ల గ్రామానికి స్వచ్ఛభారత్ కింద 100కు పైగా మరుగుదొడ్లు అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. చాలామంది మరుగుదొడ్లు నిర్మించుకోలేకపోయారు. అంతలోనే ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. మంజూరైన నిధులను ఓ ఏపీఎం సహకారంతో మింగేశారు. చంద్రాచర్ల గ్రామంలోనే రూ.5.64 లక్షలు దోచేశారు. ఈ అవినీతి వెనుక ఆ గ్రామంలోని వైసీపీ నాయకులతో పాటు కొందరు కిందిస్థాయి సిబ్బంది కూడా కుమ్మక్కు కావడంతో వారి పని సులభంగా జరిగిపోయింది. ఇదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో మరుగుదొడ్ల నిధులన్నీ కాజేసినట్టు తెలుస్తోంది. వైసీపీకి చెందిన మండల కీలక నేత బినామి బ్యాంకు ఖాతాలు చూపి పేదల సొమ్ము కాజేయగా మరికొందరు కాంట్రాక్టర్ల అవతారమెత్తి లబ్ధిదారులకు అందాల్సిన సొమ్మంతా తమఖాతాలోకిజమ చేసుకున్నారు. లబ్ధిదారులకు తెలియకుండానే ఈ సొమ్మంతా కాజేశారు. ఇలా ఇంకా ఎన్ని గ్రామాల్లో జరిగిందో విచారణ చేస్తే బయటపడుతుంది. ప్రతి గ్రామంలో దాదాపు రూ.2లక్షల నుంచి రూ.6లక్షల దాకా అవినీతికి పాల్పడినట్టు తెలుస్తోంది. 2019-24 మధ్య కనగానపల్లి మండలంలో మరుగుదొడ్ల నిధులలో జరిగిన అవినీతికి అంతులేకుండా పోయిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


అవినీతి తేలితే చర్యలు: హేమలత, ఏపీఎం

కనగానపల్లి మండలంలో గ్రామ సంఘం నిధులు పక్కదారి పట్టడంపై మాకు కూడా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ అవినీతి వెనుక ఎవరెవరు ఉన్నారనే అంశంపై విచారణ చేస్తున్నాం. ఇందులో అవినీతి తేలితే పై స్థాయి అధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం.

ఎలా కాజేశారంటే..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్ కింద కనగానపల్లి మండలానికి 10వేలకు పైగా మరుగుదొడ్లు మంజూరు చేశారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15వేలు మంజూరు చేశాయి. నిర్మాణాలు జరుగుతుండగానే ప్రభుత్వం మారింది. దాదాపు 50 శాతం మంది నిర్మించుకోగా మిగిలినవి వివిధ దశల్లో నిలిచిపోయాయి. ప్రభుత్వం మారగానే ఆ నిధులన్నీ గ్రామసంఘంలో నిలిచిపోయాయి. ఈ నిధులపై కన్నేసిన అప్పటి అధికార వైసీపీ నాయకులు స్వాహా చేయడానికి తెరలేపారు. చంద్రాచర్ల గ్రామంలో మరుగుదొడ్ల నిధులు నిలిచిపోగా మండలానికి చెందిన వైసీపీ కీలక నేత మామిళ్లపల్లికి చెందిన తన కుటుంబ సభ్యులు, అనుచరుల బ్యాంకు ఖాతాలకు నిధులు మళ్లించి భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డాడు. చంద్రాచర్ల గ్రామానికి చెందిన కొల్లాపురమ్మ గ్రామైక్య సంఘం నుంచి రూ.5.64 లక్షలు సొమ్మును 54 మంది పేర్లతో స్వాహా చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అధికారం మారడంతో సంఘంలోకి కొత్త యానిమేటర్లు రావడం, గతంలో చేసిన పనుల రికార్డులను పరిశీలించగా వైసీపీ నాయకుల బాగోతం బయటపడింది. మద్దెలచెరువులో వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ అవతారమెత్తి మరుగుదొడ్ల బిల్లులన్నీ లబ్ధిదారులకు తెలియకుండానే సంఘాలతో కుమ్మక్కై తమ ఖాతాలోకి జమచేసుకున్నారు. ఈ గ్రామంలో ఇంటి యజమానులే సొంత డబ్బులతో మరుగుదొడ్లు కట్టుకున్నప్పటికి నిధులు మాత్రం వైసీపీ నాయకుల జేబుల్లోకి పడటం చూస్తుంటే గత ప్రభుత్వ హయాంలో అవినీతి ఏ స్థాయికి చేరిందోతెలుస్తోంది. అదేవిధంగా కేఎన్‌పాళ్యం గ్రామంలో మరుగుదొడ్ల నిధులను వాటాలు పంచుకోవడంలో వైసీపీలో కొందరి మధ్య విభేదాలకు దారి తీసింది. దీంతో ఎక్కడ రికవరికి దారితీస్తుందోనన్న భయంతో కొందరు వైసీపీ నాయకులు ఎన్నికలకు ముందే టీడీపీలోకి వెళ్లినట్టు తెలుస్తోంది.


కొల్లాపురమ్మ గ్రామ సంఘం నుంచి నిధులు విత్ డ్రాకు చేసిన తీర్మానం


చంద్రాచర్ల గ్రామ సంఘం నుంచి మామిళ్లపల్లి వైసీపీ నాయకుల ఖాతాల్లో జమచేసిన దృశ్యం

సీమ సాహిత్యం స్ఫూర్తిదాయకం

- నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ స్వరూపరాణి


లేదాళ్ల రాజేశ్వరరావుకు విమలాశాంతి కవితా పురస్కారం అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ నుంచి గొప్ప ఆధునిక సాహిత్యం వస్తోందని, ఇక్కడి సాహిత్యం ఎంతో స్ఫూర్తిదాయకమని నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి పేర్కొన్నారు. విమలాశాంతి సాహిత్య సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో మంచిర్యాల జిల్లాకు చెందిన లేదాళ్ల రాజేశ్వరరావుకు విమలాశాంతి కవితా పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య స్వరూపరాణి మాట్లాడుతూ... కవి లేదాళ్ల రాజేశ్వరరావు ఓవైపు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే మరోవైపు సాహితీరంగంలో తనదైన ముద్ర వేసుకోవడం అభినందనీయమన్నారు. విమలాశాంతి సాహిత్య సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతియేటా సాహితీకారులకు ప్రోత్సాహకంగా అవార్డులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం లేదాళ్ల రాజేశ్వరరావుకు కవితా పురస్కారంతోపాటు రూ.10వేలు నగదు బహుమతి అందజేసి సత్కరించారు. విమలాశాంతి సాహిత్య సేవాసమితి వ్యవస్థాపకుడు శాంతినారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ అంకె శ్రీనివాస్, సడ్లపల్లి చిదంబరరెడ్డి, మారుతి, సురేష్, వెంకటేశులు, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ, షేక్ నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

- ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గణపతి

అనంతపురం విద్య, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యంతరభృతి ప్రకటించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు గణపతి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయభవన్‌లో ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి గణపతి, ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్‌రావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ జీవో 117 రద్దుచేసి ప్రైమరీ స్కూళ్లను 1 నుంచి 5వ తరగతి వరకూ కొనసాగించాలన్నారు. మధ్యంతర భృతి ప్రకటించడంతోపాటు, 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రైమరీ స్కూల్ టీచర్లు ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. ప్రభుత్వం సైతం ప్రైమరీ విద్యపై దృష్టి సారించాలని కోరారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మురళీమోహన్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి శంకరమూర్తి, సహాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నారాయణ, కుళ్లాయప్ప, సూర్యనారాయణ, నరేష్, వలి, సుంకన్న, లింగన్న పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్జీటీలకు శిక్షణ

- అనంత, కర్నూలు జిల్లాల నుంచి 2,642 మందికి..
- ఒక్కో బ్యాచ్‌లో 250 మంది
- రెసిడెన్షియల్ ట్రైనింగ్ వద్దంటున్న టీచర్లు
- ఏర్పాట్లు చేసిన అధికారులు

అనంతపురం విద్య, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు విద్యాశాఖ శిక్షణ ఇవ్వనుంది. ముఖ్యంగా 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు బోధనా సామర్థ్యాలను పెంపొందించుకునేలా ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ వారం రోజులపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో అందించనుంది. అనంతపురం, కర్నూలు జిల్లాల పరిధిలో 2,642 మంది ఎస్‌జీటీలకు శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి బుక్కరాసముద్రంలోని విజయభారతి డీఎడ్ కళాశాలను ఎంపిక చేశారు. మరో వైపు రెసిడెన్షియల్ తరహా శిక్షణ వద్దంటూ టీచర్లు, సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి ట్రైనింగ్ ప్రారంభం కానుంది. 12 వారాల పాటు సాగనుంది.

ఒక్కో బ్యాచ్‌కు 250 మంది..

సెకెండరీ గ్రేడ్ టీచర్లకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ వారం రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. అనంతపురం జిల్లా నుంచి 1442 మంది, కర్నూలు జిల్లా నుంచి 1200 మంది ఎస్‌జీటీలను ఎంపిక చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు చెప్పే టీచర్లకు ముఖ్యంగా తెలుగు, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులకు శిక్షణ ఇవ్వనున్నారు. టీచర్లలో బోధనా నైపుణ్యాల పెంపు కోసం పాఠశాల విద్యాశాఖ జ్ఞాన్ ప్రకాష్- 60 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఈ శిక్షణ అందిస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 250 మందికి చొప్పున 12 వారాలపాటు శిక్షణ అందించనున్నారు.

టీచర్లు, సంఘాల నేతల విముఖత

ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ రెసిడెన్షియల్ తరహాలో ఇస్తుండడంతో.. చాలా వరకు విముఖత చూపుతున్నారు. ముఖ్యంగా మహిళా టీచర్లు, వారిలో గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు, చిన్న పిల్లలున్న తల్లులు, వయస్సు మళ్లిన వారు ఇబ్బంది పడతారని ఉపాధ్యాయులు, సంఘాల నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఆరు రోజులపాటు ఒకే ప్రాంతంలో ఉండి శిక్షణ తీసుకోవడంలో అనేక ఇబ్బందులున్నాయని అంటున్నారు.

నేటి నుంచి ఎఫ్ఎల్ఎన్ శిక్షణ: నాగరాజు, ఏపీసీ, సమగ్రశిక్ష

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ జరుగుతోంది. రెసిడెన్షియల్ తరహాలోనే శిక్షణ ఉంటుంది. ఒక్కో బ్యాచ్‌లో 250 మంది ఉంటారు. మొదటి విడతలో అనంతపురం జిల్లా నుంచి 125, కర్నూలు జిల్లా నుంచి 125 మందిని కేటాయించారు. ప్రతి మండలం నుంచి ఎస్‌జీటీలు ట్రైనింగ్‌కు వచ్చేలా చూడాలని ఎంఈఓలను ఆదేశించాం. టీచర్లు హాజరయ్యేలా చూసే బాధ్యత ఎంఈఓలదే. ట్రైనింగ్ సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు చేశాం.

సంక్షిప్తం

23న ఎరువుల డీలర్ల ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనంతపురం అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం ఉమ్మడి అనంత జిల్లా నూతన కార్యవర్గాన్ని ఈనెల 23న ఎన్నుకోనున్నట్లు ఆ సంఘం అనంత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సిరిగుప్ప వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 23వ తేదీ ఉద యం 10 గంటలకు సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు వీవీ నా గిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. ఉమ్మడి జిల్లాకుచెందిన డీలర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు భూసమస్యల పరిష్కార వేదిక

రామగిరి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2గంటలకు రైతులకు సంబంధించి దీర్ఘకాలిక ంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రజా రెవెన్యూ దర్బార్ భూ సమస్యల పరిష్కార వేదిక పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ మండల నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఆర్డీఓ మహేశ్, ఇతర అధికారులు హాజరవుతారని తెలిపారు. భూసమస్యలున్న రైతులు పాల్గొనాలని వారు కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనీల్‌కుమార్ ఆదివారం తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పశువుల సంత ఆదాయం రూ.4.22లక్షలు

అనంతపురం రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.4,22,740 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. యార్డులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,23,550, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,99,190 వచ్చిందని తెలిపారు.

సీఐ శేఖర్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రూరల్ సీఐగా శేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా వీఆర్‌లో ఉన్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ రామక్రిష్ణారెడ్డిని వీఆర్‌కు పంపారు. ఈ సందర్భంగా సీఐ శేఖర్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

105 మందికి కంటి పరీక్షలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్, పుష్పగిరి కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పాల్ హారిస్ హాల్‌లో ఉచిత కంటివైద్య పరీక్షలు నిర్వహించారు. 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 30 మందిని ఆపరేషన్‌కు ఉన్నట్లు గుర్తించారు. వారిని కడపలోని పుష్పగిరి హాస్పిటల్‌కు తరలించారు. సక్షమ్ జిల్లా అధ్యక్షుడు సుంకు వేణు గోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుట్లూరు లక్ష్మీకాంతరెడ్డి, శేషాంజనేయులు, విజయభాస్కర్, సువర్ణదేవి, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

రాప్తాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీ సమీపంలో ఉన్న గణేష్ ట్రేడర్స్ గోడౌన్‌లో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. మండలానికి చెందిన గురజాల మాధవ నాయుడుకు మైనార్టీ కాలనీ సమీపంలో వేరుశనగ విత్తనాల నుంచి నూనె తీసే గోడౌన్ ఉంది. రైతులు, వ్యాపారుల నుంచి విత్తనాలు కొనుగోలు చేసి నూనె తయారు చేసి విక్రయిస్తుంటారు. వేరుశనగ విత్తనాలు, కాయలు, నూనె, వేరుశనగ చెక్కను గోడౌన్ పక్కన గల మరో గోడౌన్‌లో ఉంచాడు. ఆదివారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో గోడౌన్‌లో అగ్ని ప్రమాదం సంభవించి మంటలు వ్యాపించాయి. వెంటనే ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. అప్పటికే గోడౌన్‌లో వేరుశనగ కాయలు, విత్తనాలు, నూనె కాలిపోయాయని యజమాని వాపోయాడు. అనంతపురం జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు గోడౌన్‌ను పరిశీలించారు. ఈ ఘటనపై గోడౌన్ యజమాని ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేశారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

భయంభయంగా... చదువులు

- పెచ్చులూడి కారుతున్న తరగతి గది పైకప్పు
- అదనపు తరగతి గది నిర్మాణం పూర్తికాక అవస్థలు
- పట్టించుకోని అధికారులు



ఎర్రంపల్లి పాఠశాలలో ఒకే గదిలో ఐదు తరగతులను నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రంపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం వచ్చిందం టే విద్యార్థులు భయంభయంగా చదువులను సాగిస్తున్న పరిస్థితి. పాఠ శాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 20 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇద్దరు టీచర్లు ఉన్నారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ఒక గదిలోనే ఐదు తరగతు లను



పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్న తరగతి గది పైకప్పు

నిర్వహిస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ గది పైకప్పు నీరు కారుతోంది. పెచ్చులూడి పడుతుండటంతో తల్లిదండ్రులు భయాందో ళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉందని వర్షాకాలంలో పిల్లలను బడికి పంపాలంటే భయంగా ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పాఠశా ల ఆవరణంలో వర్షపు నీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆగిన అదనపు గది నిర్మాణం: పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. సర్వశిక్ష అభియాన్ కింద అదనపు తరగతి గది మంజూరైనా, పనులు మొదలు పెట్టి నిలిపేయడంతో మంజూరైన నిధులు వెనక్కి వెళ్లినట్లు తెలిసింది. దాని నిర్మాణం నిలిచి పోయి దాదాపు మూడేళ్లు అవుతోంది. అధికారులు పట్టించు కోకపోవడంతో ఉన్న ఇరుకుగదిలోనే టీచర్లు ఐదు తరగతులను కొనసాగిస్తున్నారని గ్రామస్థులు అంటున్నారు. ఆ గది పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో టీ చర్లు భయపడుతూ తరగతులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిలిచిపోయిన అదనపు తరగతి గది నిర్మాణాన్ని పూర్తీ చేయాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

పాఠశాల ఆవరణంలో కూలిన చెట్లు: స్థానిక పాఠశాల ఆవరణలో గురువారం రాత్రి గాలివానకు రెండు చెట్లు కూలి పాఠశాల ఆవరణంలో ని అంగన్‌వాడీ భవనం పక్క పడ్డాయి. అప్పుడు పాఠశాల లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థు లు అన్నారు. మరికొన్ని కూలడానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు చొరవ తీసుకుని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బడికి పంపాలంటే భయపడుతున్నారు



పాఠశాల తరగతి గది శిథిలావస్థలో ఉంది. పైక ప్పు పెచ్చులూడుతోంది. ఎక్కడ పిల్లల మీద పడుతా యోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నా రు. ప్రస్తుతం ఎడతెరపి లేని వర్షాలతో గది కారుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదనపు తరగతి నిర్మాణం ఆగిపోయి మూడేళ్లు కావస్తున్నా పట్టించుకున్న వారేలేరు

- శివారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్, ఎర్రంపల్లి

అభివృద్ధి పనులను అడ్డగిస్తే... ఊరుకునేది లేదు

- ఎమ్మెల్యే పరిటాల సునీత



ఆలమూరులో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జానెడు రోడ్డు వేయలేకపోయినా.. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాటలు మాత్రం కోటలు దాటేవని ఎమ్మెల్యే పరిటాల సునీత ఘాటుగా విమర్శించారు. మండలంలోని ఆలమూరులో ఆదివారం మధ్యాహ్నం పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరయ్యారు. ముందుగా రూ.20లక్షలతో సీసీ రోడ్డు, రూ.2లక్షలతో రచ్చకట్ట నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. అనంతరం సమావేశంలో ఆమె మాట్లాడుతూ... అభివృద్ధి కోసం కలిసి వస్తే కలుపుకొని పోతామని.. అదే అభివృద్ధికి అడ్డు తగిలితే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. వారు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయరని, ఇంకొకరు చేస్తుంటే కమీషన్ల కోసం అడ్డుకుంటారని విమర్శలు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన కేవలం వందరోజుల్లోనే ఆలమూరుకు రోడ్డు వేయిస్తున్నామని, రానున్న రోజుల్లో ఇంకా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతామన్నారు. గ్రామస్థులు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మండలంలో అనర్హులను ఏరి వేసి అర్హులందరికీ పింఛన్లు, ఇంటి పట్టాలు ఇవ్వడమే కాకుండా ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. దీపావళికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్ల పంపిణీ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, పీఆర్ జేఈ వెంకట శేషయ్య, పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు సూరి, బాలు, హరి, వీరాంజినేయులు, రామ్మోహన్, ఈశ్వరయ్య, వెంకటేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య చర్యలు



రామినేపల్లిలో కాలువలు శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ తిరుపాలు

రాప్తాడు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య సమస్యలు లేకుండా చూస్తామని రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు తెలిపారు. మండలంలోని రామినేపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించారు. దీర్ఘకాలంగా పూడిపోయిన మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. సర్పంచ్ మాట్లాడు తూ రాప్తాడు పంచాయతీ పరిధిలోని రాప్తాడు, రామినేపల్లి, గంగలకుంట గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించి మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

అరుదైన ఆపరేషన్



కోలుకున్న బాధితుడితో కిమ్స్ సవీరా డాక్టర్

అనంతపురం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : టీబీవ్యాధితో బాధపడుతున్న ఓ రోగికి కేన్సర్ అనితేలింది. స్థానిక కిమ్స్ సవీరాలో అతడికి ఆపరేషన్ చేయగా ఆరోగ్యంగా కోలుకున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ స్పత్రి డాక్టర్ మహ్మద్‌షాహీద్ ఆదివారం వెల్లడించారు. శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నానికి చెందిన కుళ్లాయప్ప అనే వ్యక్తి రెండునెలల పాటు తీవ్ర కడుపునొప్పితో బాధపడ్డాడు. అతడిని కుటుంబసభ్యులు బెంగళూరుకు తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు టీబీతో పాటు పెద్దపేగుకు క్యాన్సర్ ఉందని నిర్ధారించారు. కుటుంబసభ్యులు అక్కడి నుంచి కిమ్స్ సవీరా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడి డాక్టర్లు పరిశీలించి ఆపరేషన్ చేస్తామని చెప్పగా వారు అంగీకరించారు. ఆస్పత్రిలోని గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు, పల్మనాలజిస్టులు బృందంగా ఏర్పడి పెద్ద పేగుకు ఉన్న క్యాన్సర్‌కు ఆపరేషన్‌చేసి తొలగించారు. కుళ్లాయప్ప ఆరోగ్యంగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి ఆదివారం డిశ్చార్జ్‌చేశారు.

రైతు సమస్యలను పట్టించుకోండి

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా రైతుల సమస్యలను ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణా, మద్యం దందాలపైనే దృష్టి పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియాలో సమావేశంలో మాట్లాడారు. ఈ యేడు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రస్తుతం రబీలోనూ విత్తనాలు, ఎరువుల కొరత వేధిస్తోందన్నారు. ఆగస్టులో కురిసిన వర్షాలకు సంబంధించి కేవలం 1.48 కోట్లు మాత్రమే నష్టం జరిగిందని జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించడం జిల్లా రైతులను నిర్లక్ష్యం చేయడమేనన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశం పెట్టి రైతుల సమస్యలపై చర్చించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. గత ప్రభుత్వంలో విత్తన వప్పుశనగ 40శాతం సబ్సిడీతో అందిస్తే ప్రస్తుతం 25శాతానికే ఇస్తున్నారన్నారు. తుంగభద్ర, హంద్రీనీవా నిర్వహణ విషయంలో అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందుతోందన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, అప్పటివరకు ప్రజలు, రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవాలని కోరారు. జిల్లా రైతుల సమస్యలపై కలిసి వచ్చే పార్టీలతో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు.

సేవాగుణం అలవరచుకోవాలి



అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతిఒక్కరూ సేవాగుణాన్ని అలవరచు కోవాలని ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ దేవర కొండ కౌసల్య పేర్కొన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రూరల్ మండలపరిధిలోని కాటిగానికాలువ గ్రామంలో ఉన్న ఆశ్రయ అనాధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, డైపర్లు అందజేశారు. ఈ సందర్భంగా కౌసల్య మాట్లాడుతూ... నిరాశ్రయులు, అనాధల కోసం మనవద్ద ఉన్నదానిలో ఎంతోకొంత సాయం చేసే అలవాటును ప్రతిఒక్కరూ అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల రోజా, ప్రసాద్, శిల్ప, శివానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నార్పల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహ పూర్వ విద్యార్థుల ప్రథమ సమ్మేళనాన్ని బొమ్మలాటపల్లి ఎర్రితాత స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ వసతిగృహంలో 1981 నుంచి 96వ సంవత్సరం వరకు వసతి పొందిన పలువురు పూర్వ విద్యార్థులంతా కలసి... తాము చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుళ్లాయప్ప, లక్ష్మయ్యస్వామి, వెంకటరాముడు, శివయ్య, సంజప్ప, వెంకటప్ప, సుంకులయ్య, పెద్దన్న, అంకన్న, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద మహాధర్నా

- బడ్జెట్‌లో జిల్లా సాగునీటికి ప్రాధాన్యమివ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రానున్న బడ్జెట్‌లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. జిల్లాకు తాగు, సాగునీటి సాధన కోసం ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపట్టామని, యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సుయాత్ర ద్వారా సీపీఎం బృందం సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించడంతోపాటు ప్రజలనుంచి అనేక సమస్యలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్రలో తాము 24 మండలాల్లో 803 కిలోమీటర్లు పర్యటించినట్లు తెలిపారు. బీటీపీ, మిడ్ పెన్నార్, జీడిపల్లి, సుబ్బరాయసాగర్ ప్రాజెక్టులు కనీస నిర్వహణకు నోచుకోలేదని తెలుస్తోం దన్నారు. జిల్లాకు ప్రధాన సాగునీటి వనరులుగా ఉన్న హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి అదేరకంగా ఉందన్నారు. నిర్వహణాలోపాలతో ఈ ఏడాది శ్రీశైలం, తుంగభద్ర డ్యాముల్లో నీరు పుష్కలంగా ఉన్నా జిల్లాకు తీసుకురాలేని పరిస్థితి ఉందన్నారు. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శనివారం జలవనరులశాఖ అధికారుల సమీక్ష నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. నవంబరులో పెట్టబోయే బడ్జెట్‌లో జిల్లా సాగునీటికి నిధులు ప్రత్యేకంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. బస్సు యాత్ర సందర్భంగా కనిపించిన సమస్యల్లో గిట్టుబాటు ధరల అంశం కూడా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే గిట్టుబాటు ధర కల్పించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించే ధర్నాలో రైతులు, ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, సావిత్రి, నాగేంద్రకుమార్, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆశ్వీయుజ బహుళ చవితిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో సంకష్ట చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో మాజీరోడ్డులోని షిర్డీసాయిబాబా ఆలయంలో గణనాథుడి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించడంతో పాటు గరిక, కుడుముల మాలలు సమర్పించా రు. ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బాబా అవతరణ వేడుకలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం భగవాన్ సత్యసాయిబాబా అవతార దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రితోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో సత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు చేయడంతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, సిబ్బంది రాఘవేంద్ర, వైద్య విద్యార్థులు విఘ్నేష్, రమణ, లత, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మరవ వద్ద బ్రిడ్జి నిర్మించండి

- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ వినతి



సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శింగనమల చెరువు మరవ వద్ద ప్రమాణికులకు ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. ఆమె ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాల యంలో సీఎం చంద్రబాబును కలసి, నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై విన్నవించారు. ఎక్కువగా వర్షాలు వచ్చినప్పుడు జిల్లాలో అతి పెద్దదైన శింగనమల శ్రీరంగరాయచెరువు నిండి వరదనీరు నెలలు పాటు పారుతుందని, దీంతో శింగనమల మండలం నుంచి అనంతపురం, తాడిప త్రికి రాకపోకలు నిలిచిపోతాయని సీఎంకు వివరించారు. దీంతో ప్రయాణి కులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మరవ ప్రాంతంలో బ్రిడ్జి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే నియోజకవ ర్గంలోని యల్లనూరు, పుట్లూరు, నార్పల, గార్లదిన్నె మండలల్లో 32 వేల ఎకరాల్లో చీనీ పంటలు సాగు చేస్తున్నారని, మంత్రి నారాలోకేశ్ యవగళం పాదయాత్రలో 800 కిలో మీటర్ల మైలురాయి వేసిన సందర్భంగా ఇక్కడ చీనీ ప్రాసెసింగ్ యానిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్టు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం సానూకులంగా స్పందించి శింగనమల చెరువు మరవ వద్ద బ్రిడ్జి, గార్లదిన్నె మండలం మర్తాడు వద్ద ప్రాసెసింగ్ యానిట్‌కు నిధులు ఇస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజలకు ఏ సమస్య వచ్చినా స్పందించాలి

- ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఏ సమస్య వచ్చినా మన బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. అనంతపురం రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శేఖర్, రాప్తాడు మండల విద్యుత్ శాఖ ఏఈఈగా నియమితు లైన శివకుమార్ తదితరులు ఆదివారం నగరంలోని ఎమ్మెల్యేను ఆమె క్యాంపు కార్యాల యంలో కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. పోలీసులు పార్టీలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఎక్కడా రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేకంగా చొరవ చూపాలని సూచించారు.

'అమ్మ పేరు మీద ఒక మొక్క నాటుదాం'



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద ఒక మొక్క నాటి సంరక్షించాలని నెహ్రూ యువ కేంద్రం అధికారులు పిలుపునిచ్చారు. కేంద్ర క్రీడా యువజన శాఖ, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఏక్ పేడ్ మా కా నామ్ అంశంపై క్విజ్, వక్తృత్వ, పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఎన్‌వైకే ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీటీ గోపినాథ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి హరీష్‌కుమార్ యాదవ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, ప్రొఫెసర్ ప్రణతి, సభ్యులు పవన్, నందిత, ప్రెసిల్లా, దేవహర్ష, జాతీయ యువకార్యకర్తలు పాల్గొన్నారు.

బృందగానంలో నగర విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న సెయింట్ మేరీ స్కూల్ విద్యార్థినులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ మేరీ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినులు బృందగానం పోటీల్లో ప్రతిభ చాటుకున్నారు. కర్నూలులోని విజయదుర్గ డిగ్రీ కళాశాలలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బృందగాన పోటీల్లో సెయింట్ మేరీ స్కూల్ విద్యార్థినులు వేణి, శశిధర్, రమ్య బృందం పాల్గొని శాస్త్రీయ సంగీతంతో అలరించారు. పోటీల్లో వీరికి ప్రథమస్థానం లభించడంతోపాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం విద్యార్థినులకు భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో వేణు, హరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్-14 జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన ఎస్‌జీఎఫ్-14 చెస్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్-14 జిల్లా చెస్ క్రీడాకారులను ఎంపిక చేశారు. స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్-14 ఆధ్వర్యంలో చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన బాలుర జట్టులో....రిషిక్, మోక్షిత్‌చౌదరి, నీల్‌శ్రీ వాత్సవ్, చేతన్‌రెడ్డి, నితీష్ ఉండగా, బాలికల విభాగంలో అస్మిత, యశస్విని, లాలిత్య, త్రిపద, అంబికా ఉన్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణబాయి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, వరలక్ష్మి, అమీన్, విజయలక్ష్మి, శివకుమార్, రవికుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-బి పోటీల్లో పలు జట్ల విజయం



కబడ్డీ ఫైనల్‌కు చేరిన ఎస్ఎస్‌బీఎన్, ఆర్ట్స్ కళాశాల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్కే యూనివర్సిటీ అంతర్ కళాశాలల బి - గ్రూప్ టోర్నీలో పలు జట్లు విజయం సాధించాయి. నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఎస్కేయూ అంతర్ కళాశాలల గ్రూప్- బి పోటీలు ఆదివారం నిర్వహించారు. బాస్కెట్‌బాల్ పోటీలలో ఎస్కేయూపై ఎస్ఎస్‌బీఎన్ జట్టు గెలుపొందింది. షటిల్ బ్యాడ్మింటన్‌లో ఎస్ఎస్‌బీఎన్‌పై ఆర్ట్స్ కళాశాల జట్టు విజయం సాధించింది. కబడ్డీలో ఎస్ఎస్‌బీఎన్, ఆర్ట్స్ కళాశాల జట్లు సోమవారం చివరి మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల పీడీ ప్రసాద్, పీడీలు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పీ నారాయణపురాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చాలి

కూడేరు, అక్టోబరు, 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీ నారాయణపురం గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చాలని ఆ గ్రామ సర్పంచు హనుమంతరెడ్డి, టీడీపీ నాయకులు ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. అనంతపురంలో ఆదివారం వారు మంత్రిని కలిసి మాట్లాడారు. పీ నారాయణపురం గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా మార్చడం తోపాటు ఎంఎంహళ్లి గ్రామానికి తారురోడ్డు వేయాలని, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, ఎస్టీ కాలనీలో నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. అలాగే పీఏబీఆర్ డ్యాంకు వెళ్లే రహదారి గుంతలుగా మారిందని, కొత్తరోడ్డు మంజూరు చేయాలని జల్లిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చంద్రమోహన్ మంత్రికి వినతిపత్రం అందజేశారు.

మహాసభ కరపత్రాల విడుదల

గుంతకల్లుటౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభ కరపత్రాలను ఏఐఎస్ఎఫ్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. వీటిని నిరసిస్తూ నవంబరు 27నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయన్నారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

ఉరవకొండ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నముష్టూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల25వ తేదీన జాబ్‌మేళా ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అష్రఫ్ అలీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో టాటా ఎలక్ట్రానిక్స్, కోజెంట్, ఈ సర్వీసెస్ వంటి కంపెనీలు పాల్గొంటాయన్నారు. అవకాశాన్ని ఇంటర్, ఐటీఐ, పీజీ వరకూ చదువుతున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7013800115 కు సంప్రదించాలని సూచించారు.

ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి


దుప్పట్లను పంపిణీ చేస్తున్న వక్తలు

గుత్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని వక్తలు సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం లయన్స్ క్లబ్ సమావేశం జరిగింది. స్థానిక సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి విశ్వనాథాచారి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, పీజేఆర్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు జీవానందరెడ్డి హాజరై జ్యోతి ప్రజల్వన సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవాకార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈసేవలను మరింత విస్తృత పరచాలన్నారు. ప్రతిఒక్కరూ సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం అనాథలకు దుప్పట్లను పంపిణీ చేశారు. తర్వాత గుత్తికోట లయన్స్ క్లబ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీసీ వెంకప్ప, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వరరెడ్డి, ఇస్కాన్‌గోపాల్, కార్యదర్శిగా మహబుబ్ బాషా, కోశాధికారిగా శ్రీనివాసులు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా హనుమేష్‌రెడ్డి తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వరావు, వైస్‌గవర్నర్ విరూపాక్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎండీ గౌస్ జన్మదిన వేడుకలు


గౌస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీఐ నాయకులు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆయన చేత కేక్ కట్ చేయించారు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బీ మహేష్, మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్‌తో పాటు ఇతర పార్టీల నాయకులు గౌస్‌కు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత ఉప్పొంక జట్టు


విజేతజట్టుకు షీల్డ్ అందజేస్తున్న టీడీపీ నేత ధర్మతేజ

కళ్యాణదుర్గం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) మండలంలోని తూర్పు కోడిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచన మేరకు యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గాను క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తూర్పుకోడిపల్లి జట్టు, ఉప్పొంక జట్టు తలపడ్డాయి. ఉప్పొంక జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఎమ్మెల్యే అమిలినేని ప్రకటించిన రూ. 30 వేలు నగదు బహుమతిని, షీల్డ్‌ను టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ అందజేశారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన తూర్పు కోడిపల్లి జట్టుకు రూ. 20 వేలు, నగదు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

దాడిలో ముగ్గురికి గాయాలు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరిపల్లి గ్రామంలో లాలెప్ప, అతడి కుటుంబసభ్యులు దాడి చేసి ముగ్గురిని గాయపరిచారు. వివరాల్లోకెళ్తే.. చిన్నప్ప అనే వ్యక్తి పొలం పక్కన లాలెప్ప పొలం ఉంది. కాగా ఆదివారం ఉదయం చిన్నప్ప తన పొలంలో గడ్డిని కోసి పక్క పొలం గట్టుపైన వేశాడు. దీంతో లాలెప్ప, అతడి కుటుంబసభ్యులు సుధాకర్, నారాయణ, సావిత్రి మా పొలంలో గడ్డి వేస్తావా అని చిన్నప్ప, అతడి కుమారుడు సుధాకర్, కోడలు సునీతపై దాడి చేశారు. ఈ దాడిలో చిన్నప్పకు చేయి విరిగింది. కొడుకు, కోడలికి స్వల్పగాయాలయ్యాయి. చిన్నప్పను చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రబ్బాడులో ఒకరికి..

గుంతకల్లుటౌన్: మండలంలోని గుర్రబ్బాడు గ్రామానికి చెందిన సురేష్‌పై సమీప బంధువు తిమ్మప్ప, అతడి కుటుంబసభ్యులు ఆదివారం దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బండయ్య, తిమ్మప్ప అన్నదమ్ములు. ఇరువురికి కలిసి ఊరిబయట వామిదొడ్డి ఉంది. కాగా వారి మధ్య గత ఆరు నెలలుగా వామిదొడ్డి స్థలంపై వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బండయ్య కుమారుడు సురేష్ వామిదొడ్డి వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న తిమ్మప్ప స్థలం విషయమై అతడితో వాగ్వాదం చేశాడు. ఘర్షణకు దారి తీయడంతో సురేష్‌పై తిమ్మప్ప, అతడి కుటుంబసభ్యులు శివారెడ్డి, సరస్వతి, హేమంత్ కలిసి దాడి చేశారు. సురేష్‌కు తలకు గాయమైంది. అతడిని చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


భరత్

పుట్లూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఆర్డీటీ మైదానంలో ఈనెల 19న నిర్వహించిన అండర్-17 కబడ్డీ సెలెక్షన్స్‌లో మండలకేంద్రంలోని జడ్పీహైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి భరత్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ మురళీ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అన్నమయ్యజిల్లా రాయచోటిలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో భరత్ పాల్గొంటాడని చెప్పారు.

ఆ రోడ్డుపై ప్రయాణం.. నరకం

● గుంతలమయంగా యాడికి-తాడిపత్రి రహదారి

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు


అధ్వానంగా ఉన్న యాడికి- తాడిపత్రిరోడ్డు

యాడికి, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): యాడికి నుంచి తాడిపత్రి వెళ్లే రోడ్డంతా పూర్తి గుంతలయమంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తిరుణాంపల్లి గ్రామం వద్ద రోడ్డుపై మోకాలి లోతు వరకు గుంతలు పడ్డాయి. రోడ్డంతా కంకర తేలి ఉంది. దీంతో ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు గుండా అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ, సాగర్ ఫ్యాక్టరీ, అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలకు ప్రతిరోజూ వందల సంఖ్యలో కార్మికులు ద్విచక్రవాహనాల్లో వెళుతుంటారు. రాత్రి వేళల్లో వారు రోడ్డుపై గుంతలను తప్పించబోయి తరచుగా ప్రమాదాల భారిన పడుతున్నారు. ఈ దారిలో బస్సులు, లారీలు, ఆటోల్లో ప్రయాణించే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అధికారులు తగు చర్యలు చేపట్టి రోడ్లకు మరమ్మత్తులు వాహనదారులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే..


బురదమయమైన తొండపాడు-గొందిపల్లి రోడ్డు

గుత్తిరూరల్: మండలంలోని తొండపాడు నుంచి గొందిపల్లికి వెళ్లే రోడ్డు చిన్నపాటి చినుకులకే చిత్తడిగా మారుతోంది. తొండపాడు నుంచి గొందిపల్లికి 2019 లో తారు రోడ్డు వేశారు. కాగా మధ్యలో ఒక కిలోమీటరు మేర తారు వేయకుండా మట్టి రోడ్డుని అలాగే వదిలేశారు. ఆ మట్టి రోడ్డు చిన్నపాటి చినుకులకే చిత్తడిగా తయారవుతోంది. ఈ దారి గుండా గొందిపల్లితో పాటు నంద్యాల జిల్లా మామిళ్లపల్లి, రాంపురం, జక్కసానికుంట్ల, పీఆర్ పల్లికి ద్విచక్రవాహనాలు, ఆటోలలో నిత్యం అనేకమంది వెళుతుంటారు. వర్షాకాలంలో ఈ దారి తీవ్ర చిత్తడిగా తయారవుతోంది. ద్విచక్రవాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాయి. ఇక రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే ప్రమాదాలకు గురికావాల్సిందే. ఇప్పటికైన అధికారులు స్పందించి ఆ కిలోమీటరు మేర బీటీ రోడ్డును వేయాలని ప్రజలు కోరుతున్నారు.

దారి ఇలా.. రాకపోకలు ఎలా?


చిత్తడిగా ఉన్న పొలాలకు వెళ్లే రోడ్డు

బొమ్మనహాళ్: గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని దేవగిరి గ్రామంలో పొలాలకు వెళ్లేందుకు ఉన్న దారి తీవ్ర అధ్వానంగా తయారైందని రైతులు, వ్యవసాయ కూలీలు వాపోతున్నారు. తీవ్ర చిత్తడిగా మారి అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. ఈదారి గురించి పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు. వర్షం పడితే విపరీతమైన చిత్తడిగా తయారవుతోందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చి అవి చేస్తాం.. ఇవి చేస్తామని అంటున్నారే కానీ.. ఎన్నికల అనంతరం ఇటువైపు కూడా కన్నెత్తి చూడడం లేదని ఆమె ఆవేదన చెందుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

బెళుగుప్ప, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఆ పాఠశాలలో 1995-96 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న 76 మంది విద్యార్థులు సుమారు 28 ఏళ్ల తర్వాత అదే పాఠశాలలోనే కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు వెంకటరమణ, రామకోటి, దస్తగిరి, వెంకటరామయ్య, రత్నమ్మ, వెంకటస్వామి, రామకృష్ణ, కృష్ణమూర్తి, వెంకటప్రసాద్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఎంఈవో మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలాజీ, తిమ్మారెడ్డి, శివయ్య, గంగాధర, శివ తదితరులు పాల్గొన్నారు.

పంట నూర్పిడి పట్టల దగ్ధం

పుట్లూరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం గ్రామంలో నాగప్ప అనే వ్యక్తికి చెందిన పంట నూర్పిడికి ఉపయోగించే పట్టలను గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. నాగప్ప ఇంటిపక్కన గదిలో సుమారు 60 పట్టలను పెట్టి బాడుగకు ఇస్తూ జీవనం సాగించేవాడు. కాగా ఆదివారం ఆయన పొలం వద్దకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పట్టలు మొత్తం కాలిపోయాయి. దీంతో సుమారు రూ.50వేల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. ఈ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

పొలికిలో వైద్యశిబిరం

విడపనకల్లు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలికి గ్రామంలో మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటైంది. అనంతపురంలోని మార్క్ ఆస్పత్రికి చెందిన వైద్యుడు పాల్గొని గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. వివిధ గ్రామాల నుంచి సుమారు 175 మంది దాకా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులు, రమేష్, సంపత్ కుమార్, జెట్టి భాస్కర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయిబాబా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సత్యసాయి బాబా అవతార ప్రకటన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయంలో బాలసత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ప్రత్యేక వాహనంలో సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఉంచి మేళతాళాలతో పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో భజన బృందం సభ్యులు భజనలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు రామచంద్ర, ఆధ్యాత్మికత కోఆర్డినేటర్ శైలజ, సేవా విభాగం కన్వీనర్ అనూరాధ, అనంతపురం, ఉరవకొండ సమితి కన్వీనర్లు నరసింహప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాలవ రాక

బొమ్మనహాళ్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి సోమవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, నాయకుడు నవీన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పల్లె పండుగలో భాగంగా గ్రామంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం ఆయన వస్తున్నారన్నారు. మండలంలోని కూటమి శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు

గుమ్మఘట్ట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపసముద్రం గ్రామంలో యాదవుల ఇలవేల్పు ఎల్లమ్మదేవి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కర్ణాటక పరిసర ప్రాంతాల నుంచి యాదవులు భూపసముద్రం గ్రామానికి చేరుకుని ఎల్లమ్మదేవి ఉత్సవ విగ్రహాన్ని వేదావతి హగరిలో గంగస్నానానికి తీసుకెళ్లి పూజలు జరిపించారు. అనంతరం గ్రామపురవీధుల్లో ఊరేగించారు.

నేడు రక్తదానశిబిరం

యాడికి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్, లియోక్లబ్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు, యాడికి సీఐ ఈరన్న హాజరుకానున్నారన్నారు. రక్తదాతలు విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు

బ్రహ్మసముద్రం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కంబదూరు మండల బీజేపీ నాయకుడు విశ్వనాథరెడ్డిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల నాయకులు మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, మండల మాజీ కన్వీనర్ వెంకటేశులు, మాజీ ఎంపీపీ వన్నూరుస్వామి, సర్పంచ్ మల్లి, నాయకులు సుభాన్, అమరా రాంమోహన్, వెంకటేశులు, తిరుమల, నంజాపురం రాము, ఎర్రిస్వామి, హనుమంతు, లచ్చన్న, హరీష్ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.రెండు లక్షల వితరణ

కుందుర్పి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నూతనంగా చేపట్టిన వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ. రెండు లక్షలను వితరణ చేశారు. ఆలయ నిర్మాణానికి సాయం చేయాలని ఇటీవల గ్రామపెద్దలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు గాను ఆదివారం ఆయన రూ. రెండు లక్షల చెక్కును మేనల్లుడు ధర్మతేజ ద్వారా వాల్మీకి కుల పెద్దలకు పంపిణీ చేయించారు. వాల్మీకులు ధర్మతేజను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

గుర్తుతెలియని మహిళ మృతి


మహిళ మృతదేహం

గుత్తి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రైల్లో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని ముస్లిం మహిళ మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. ఆదివారం రాయచూరు నుంచి గుంతకల్లు మీదుగా కన్యాకుమారికి వెళ్తున్న రైలులో 46 ఏళ్ల వయసు గల ఓ మహిళ అపస్మారకస్థితిలో ఉండగా స్థానిక ప్రయాణికులు రైల్వే అధికారులకు సమాచారం అందించారు. గుత్తి రైల్వేస్టేషన్‌లో ఆ ఆమెను స్థానిక వైద్యుడు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించాడు. మృతదేహాన్ని రైలులో నుంచి దింపి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మార్చురీకి తరలించారు. ఈమె పింక్ కలర్ పంజాబీ డ్రస్సు, నలుపు రంగు బురకా ధరించిందన్నారు. ఈమెకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈమె ఆచూకీ తెలిసిన వారు ఎ6305073235కు సంప్రదించాలని రైల్వే ఎస్ఐ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊబిచెర్ల గ్రామశివారులో గల 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గుంతకల్లు మండలం గుర్రబ్బాడు గ్రామానికి చెందిన శివశంకర్, చంద్రశేఖర్ ద్విచక్రవాహనంలో శ్రీశైలానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఊబిచెర్ల గ్రామశివారులోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో వారిరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కార్మికుల సమస్యలపై సమావేశం

కళ్యాణదుర్గం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదుట జనరల్ బాడీ సమావేశం జరిగింది. మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు, రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కానికి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా దశలవారీగా ఆందోళనలు చేపడతామని, అలాగే కమిషనర్, చైర్మన్‌లకు , ఎమ్మెల్యేలకు, కార్మికులందరూ చేత సంతకాల సేకరణ చేయించి వినతిపత్రం ఇస్తామని తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడతామని అన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం సభ్యులు, కార్మికులు యల్లక్క, అలివేలమ్మ, సరస్వతి, గంగాధర, శివయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పని సరి

విడపనకల్లు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టపాసులు విక్రయించేవారు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ఖజా హుస్సేన్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా టపాసుల విక్రయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీపావళి సందర్భంగా ఎవరైనా అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపాసులు విక్రయించాలంటే సంబంధిత జిల్లా అధికారుల వద్ద అనుమతులు పొందాలని తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటినా ఇంతవరకు కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటికైనా శాఖల వారిగా యూనియన్లతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కూడేరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్కూరు గ్రామ సమీపంలో పేకాట కేంద్రంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. అందులో పేకాటాడుతున్న ఐదుగురిని పట్టుకుని అరెస్టు చేశారు. అలాగే వారి వద్ద నుంచి రూ.8,170 నగదు తోపాటు 5 సెల్ ఫోన్లు, 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

కొత్త బస్సులతో ఆర్టీసీ సేవలు మరింత విస్తృతం

●ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ● మూడు కొత్తబస్సులు ప్రారంభం


కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్త బస్సుల ద్వారా ఆర్టీసీ సేవలను మరింత విస్తృత పరుస్తున్నామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదివారం ఆయన మూడు కొత్తబస్సులను ప్రారంభించారు. అనంతరం ఓ బస్సులో బస్టాండ్ వరకు ప్రయాణించారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. ఈ బస్సుల్లో రెండు హైదరాబాద్ మార్గంలో, ఒకటి శ్రీశైలం మార్గంలో తిరుగుతాయన్నారు. ఇప్పటివరకు ఈ డిపోకు ఆరు కొత్త బస్సులు వచ్చాయన్నారు. సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. ఆర్టీసీని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అన్నారు. సంస్థ పురోగతిలో భాగస్వాములు కావాలని ఆయన ప్రజలను కోరారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

● శిథిలావస్థలో విద్యుత్ స్తంభం

● అప్పుడో.. ఇప్పుడో కూలేలా ఉండటంతో భయాందోళన చెందుతున్న స్థానికులు


విద్యుత్ స్తంభానికి పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం జెల్లిపల్లిలో ఓ విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి అప్పుడో.. ఇప్పుడో కూలేందుకు సిద్ధంగా ఉంది. సుమారు 20 ఏళ్ల క్రితం నాటిన ఈ స్తంభానికి ప్రస్తుతం పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్నాయి. కింద నుంచి పై దాకా పూర్తి శిథిలావస్థకు చేరింది. దీంతో దాని వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు నిత్యం భయాందోళన చెందుతున్నారు. పొరపాటున అది కూలితే సుమారుగా ప్రాణనష్టం సంభవించే అవకాశం లేకపోలేదు. దాదాపు ఏడాది నుంచి పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తుండడంతో అది రోజురోజుకూ కుంగిపోతోంది. ప్రమాదం జరగకముందే సంబంధితాధికారులు స్పందించి ఆ స్తంభాన్ని తొలగించి.. కొత్తది ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఎమ్మార్సీ భవనం

● పెచ్చులూడుతున్న పైకప్పు

● భయం.. భయంగా సిబ్బంది విధులు



శిథిలావస్థకు చేరిన ఎమ్మార్సీ భవనం


ఎంఈఓ గది పైకప్పునకు ఊడిన పెచ్చులు

కూడేరు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోతుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని సిబ్బంది భయం, భయంగా కాలం గడుపుతున్నారు. ఎంఈఓ గదితో పాటు కంప్యూటర్ల గది, మీటింగ్ హాల్ పూర్తిగా పెచ్చులుడుతున్నాయి. అలాగే వర్షం వస్తే భవనం మొత్తం కారుతోందని, పుస్తకాలు, ఫైళ్లు తడిసిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. గోడలు సైతం నెమ్ము తీసుకుని నెర్రెలు చీలుతున్నాయని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్యాలయ భవనాన్ని మరమ్మతు చేయాలని వారు కోరుతున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


బొమ్మనహాళ్‌లో కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

రాయదుర్గంరూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతిని వాల్మీకి యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూపసముద్రం రోడ్డు వద్ద వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ట్రాక్టర్‌లో వాల్మీకి చిత్రపటాన్ని ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వాల్మీకులు మహేష్, ఓబయ్య, తిప్పేస్వామి, మంజు, బసవరాజు, తమ్మయ్య, ముత్తయ్య, నగేష్ పురుషోత్తం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలకేంద్రంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు కేపీ వన్నూరుస్వామి ఆధ్వర్యంలో సంఘం నాయకులు వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. సాయంత్రం చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. మహిళలు 101 కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కేశప్ప, వన్నప్ప, రామంజనేయులు, వన్నూరుస్వామి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకులు ఘనంగా జరిపారు. సర్పంచ్ నాగరాజు, సత్యనారాయణ, తిప్పేస్వామి తదితరులు స్థానిక వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం చిత్రపటాన్ని గ్రామపురవీధుల్లో ఊరేగించారు.

కత్తితో దాడి

తాడిపత్రి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్వగడ్డవీధిలో ఉన్న జెండా కట్ట వద్ద మహమ్మద్‌అయూబ్ అనే వ్యక్తిపై మౌలాలి కత్తితో దాడిచేసి గాయపరిచాడని పోలీసులు తెలిపారు. ఆసుపత్రి పాలెంకు చెందిన మహమ్మద్‌అయూబ్ శనివారం రాత్రి కాల్వగడ్డలో ఉన్న జెండాకట్ట వద్దకు గ్యార్మీ పండుగ సందర్భంగా వచ్చాడు. అయితే ఇక్కడికి ఎందుకు వచ్చావు అని కాల్వ గడ్డకు చెందిన మౌలాలి అతడితో ఘర్షణపడ్డాడు. మాటామాటా పెరగడంతో మౌలాలి కత్తితో దాడిచేసి అయూబ్‌ను గాయపరిచాడు. స్థానికులు అయూబ్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.